ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు జిల్లా వార్తలు

బుధవారం 31 జనవరి 2024



సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నిర్ణయం జిల్లా అధికార పార్టీపై పిడుగుపాటులా పరిణమించింది. ఆయన వ్యవహారం వైసీపీని కుదిపేస్తోంది. అధికార పార్టీలో తాను ఎదుర్కొన్న అవమానాలు, మానసిక క్షోభను ఆదిమూలం వెల్లడించిన వైనం బడుగు బలహీన వర్గాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అదే సమయంలో వైసీపీ అధిష్ఠానాన్ని ఆయన ధిక్కరించిన తీరు, మంత్రి పెద్దిరెడ్డిపై తిరుగుబాటు జరిపిన వైనం రాయలసీమ వ్యాప్తంగా పెద్దిరెడ్డి ప్రాబల్యాన్ని, పలుకుబడిని దెబ్బతీసింది.

వైసీపీలో దళిత ధిక్కార స్వరం

- అధికార పార్టీని కుదిపేస్తున్న ఆదిమూలం స్పందిస్తున్న తీరు
- బడుగు వర్గాలపై తీవ్ర ప్రభావం

తిరుపతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇంతవరకూ వైసీపీలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఆ స్థాయి నేతలెవరూ అధిష్ఠానాన్ని ధిక్కరించింది లేదు. ప్రాధాన్యత ఇవ్వలేదని ఒకరిద్దరు నేతలు పార్టీని వీడినా అధిష్ఠానాన్ని విమర్శించింది గానీ, తప్పు పట్టిందిగానీ లేదు. మదనపల్లెలో సిటింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషాకు టికెట్ నిరాకరించినా ఆయన మౌనంగానే వున్నారు. చిత్తూరులో సిటింగ్ ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులుకు టికెట్ లేదంటూ, రాజ్యసభ టికెట్ ఆశచూపినా ఆయనా గుంభనంగా వున్నారు తప్పితే స్పందించలేదు. ఇక గూడూరు సిటింగ్ ఎమ్మెల్యే వరప్రసాద రావుకు టికెట్ గల్లంతైనా ఆయన సైతం అంతర్గతంగా కొందరిని కలవడం తప్ప ఇప్పటి వరకూ పార్టీకి వ్యతిరేకంగా పెదవి విప్పలేదు. తిరుపతి సిటింగ్ ఎంపీని సత్యవేడు అసెంబ్లీకి పోటీచేయమని ఆదేశించినా ఆయన సైతం నోరు మెదపకుండా సత్యవేదులో పర్యటనలు ప్రారంభించారు. జీడీనెల్లూరులో సిటింగ్ ఎమ్మెల్యే నారాయణస్వామికి టికెట్ లేదని, చిత్తూరు ఎంపీగా పోటీ చేయమని ఆదేశిస్తే డిప్యూటీ సీఎంగా వుండి ఎంతో సీనియర్ అయినా కూడా ఆయన తల వంచి అంగీకరించారు. చిత్తూరు ఎంపీకి సైతం టికెట్ ఇవ్వకుండా జీడీనెల్లూరు ఎమ్మెల్యేగా పోటీ చేయమంటే ఆయన సైతం అధిష్ఠానం ఆదేశాలను మౌనంగా తలదాల్చారు. పూతలపట్టులో సిటింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు టికెట్ తిరస్కరించినా మంత్రి పెద్దిరెడ్డిని నిష్ఠూరం చేసి అంతలోనే క్షమాపణలు చెప్పారు. నగరిలో మంత్రి రోజాకు టికెట్‌పై ఇప్పటి వరకూ స్పష్టమైన హామీ లేకపోయినా ఆమె కూడా ఓపికగానే నిరీక్షిస్తున్నారు. సూళ్ళూరుపేటలో సిటింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు టికెట్ ఇవ్వవద్దని బలమైన వర్గం పట్టుబట్టినా అధిష్ఠానం ఖాతరు చేయకుండా ఆయనకే టికెట్ ఖరారు చేసింది. అయినా ఎమ్మెల్యేని వ్యతిరేకిస్తున్న వర్గం అధిష్ఠానాన్ని తప్పుపట్టే సాహసం చేయలేదు. పాత, కొత్త జిల్లాల్లో కుప్పం నుంచీ గూడూరు దాకా ఎలా చూసినా ఎవరూ పార్టీపై ధిక్కారస్వరం బహిరంగంగా వినిపించిన వారు గానీ, పార్టీని వీడిన వారు గానీ ఇప్పటి దాకా ఎవరూ లేరు. అలాంటిది సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం వ్యవహరించిన తీరు పార్టీ నేతలకు మింగుడుపడడం లేదు. ఎమ్మెల్యే టికెట్ లేదని చెప్పినా, అంత కంటే పెద్దస్థాయిలో తిరుపతి ఎంపీగా పోటీచేసే అవకాశం దక్కినా ఆయన తృణప్రాయంగా తిరస్కరించిన తీరును పార్టీ పెద్దలు జీర్ణించుకోలేకపోతున్నారు. దానికి తోడు ఏకంగా పార్టీని వీడి టీడీపీ యువనేత నారా లోకేశ్‌ను కలవడం పార్టీకి పిడుగుపాటుగా మారింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తొలి వికెట్‌ను కోల్పోవడంతో పాటు ఆయన చేసిన ఆరోపణలు పార్టీని కుదిపేస్తున్నాయి.

బలహీనపడుతున్న పెద్దిరెడ్డి ప్రాబల్యం

సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఎదురు దాడితో ఇంతకాలం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సాగిన మంత్రి పెద్దిరెడ్డి ప్రాబల్యం బద్దలైంది. 2014లో పలమనేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాల నుంచీ వైసీపీ తరపున పోటీ చేసిన మాజీ మంత్రి అమరనాథరెడ్డి, ఏపీ ప్రవీణ్‌కుమార్ రెడ్డి తర్వాత కొంత కాలం కూడా పార్టీలో వుండలేకపోయారు. అప్పట్లో వారు పార్టీని వీడడానికి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డే కారణమన్న ప్రచారం జరిగింది. అయినా ఆ ఇద్దరూ అప్పట్లో పెద్దిరెడ్డిపై బహిరంగ ఆరోపణలు గానీ, విమర్శలు గానీ చేయలేదు. అమర్ టీడీపీలో చేరి మంత్రిగా కూడా పనిచేయగా ప్రవీణ్ రాజకీయాలకే దూరమయ్యారు.2019 ఎన్నికల్లో పూతలపట్టు నుంచీ నాటి సిటింగ్ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్‌కు టికెట్ గల్లంతు కాగా ఆయన జగన్ ఇంటి ఎదుట భోరుమని విలపించారు తప్పితే మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించలేదు. ఆ ఎన్నికల్లోనే మదనపల్లెలో సిటింగ్ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి టికెట్ గల్లంతైనపుడు కూడా ఆయనా పెద్దిరెడ్డిపై విమర్శలు చేయలేదు. ఇప్పుడు కూడా ఉమ్మడి జిల్లాలో ఎన్ని మార్పుచేర్పులు జరిగినా బాధిత ఎమ్మెల్యేలు, ఎంపీలు మౌనంగా సహిస్తున్నారు తప్పితే పెద్దిరెడ్డి వైపు వేలెత్తి చూపే సాహసం చేయలేదు. అలాంటిది సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం నేరుగా మంత్రి పెద్దిరెడ్డిని ఉద్దేశించి అవినీతి, అక్రమాల ఆరోపణలు చేయడం పార్టీ వర్గాల్లో కలకలం రేపింది. జిల్లావ్యాప్తంగా పెద్దిరెడ్డి వర్గీయులు దీన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఎంపీ టికెట్ కూడా వద్దని బహిరంగంగా తిరస్కరించడం పెద్దిరెడ్డి వర్గం అహాన్ని దెబ్బతీస్తోంది. అంతకు మించి ఏకంగా పార్టీని వీడి టీడీపీ యువనేత నారా లోకేశ్‌ను కలవడం, ఆ క్రమంలో పెద్దిరెడ్డికి హెచ్చరికలు చేయడంతో మంత్రి ప్రాబల్యం దారుణంగా దెబ్బతిన్నట్టవుతోంది. పెద్దిరెడ్డిని వ్యతిరేకించే వైసీపీ వర్గాలు ఆదిమూలం ధైర్యానికి, తెగింపుకు లోలోన సంబరపడుతుండడం గమనార్హం. ఇంతకాలం ఇతర మంత్రుల నియోజకవర్గాల్లో కూడా జోక్యం చేసుకుని వారికి నిద్రాహారాలు కరువు చేసిన వైనం తలచుకుంటున్న వ్యతిరేక వర్గీయులు ఇపుడు ఓ దళిత ఎమ్మెల్యే మూలంగా తగిన మూల్యం చెల్లించుకుంటున్నారని సంబరపడుతున్నారు.

బడుగు వర్గాలపై తీవ్ర ప్రభావం

కారణాలు ఏవైనప్పటికీ జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ దళిత సామాజికవర్గాల్లో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి హీరో వర్షిప్ వచ్చినట్టవుతోంది. రాష్ట్రంలో పలుచోట్ల ఇతర సామాజికవర్గాలు వైసీపీ అధిష్ఠానంపై తిరుగుబాటు చేసిన ఉదంతాలున్నా దళిత వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచీ ఆ పరిస్థితి ఎదురుకాలేదు.అలాంటి పరిస్థితుల్లో ఆదిమూలం ఎగరేసిన తిరుగుబాటు బావుటా ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర బడుగు వర్గాల్లో విపరీతమైన చర్చకు దారి తీస్తోంది. ఎమ్మెల్యే టికెట్ నిరాకరించినా అంతకు మించిన ఎంపీ టికెట్ ఆఫర్ చేసినా ఆదిమూలం తిరస్కరించిన తీరు, తనకు పదవి, అధికారం కంటే ఆత్మగౌరవం ముఖ్యమని ప్రకటించిన వైనం అట్టడుగు సామాజికవర్గాలను కదిలిస్తోంది. తాను తప్పేమీ చేయకుండానే తనకు ఎమ్మెల్యే టికెట్ నిరాకరించడం పట్ల ఆయన తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు.దీన్ని ఇతరుల్లా దాచుకోకుండా బహిరంగపర్చడం ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర వర్గాలకు దళిత ఎమ్మెల్యేలు పడుతున్న క్షోభ తెలిసివస్తోంది.ఎస్సీ ఎమ్మెల్యేలను, ఎంపీలను టికెట్ల పేరిట తీవ్రంగా వేధిస్తున్న విషయం ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పలు స్థానాల్లో నిరూపితమైన నేపథ్యంలో ఆయా సామాజికవర్గాల్లో అధికార పార్టీ పట్ల తీవ్ర ఆగ్రహం, అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి. దానికి ఆదిమూలం తెగువ ఆజ్యం పోసినట్టయింది. ఈ పరిణామాలు అంతిమంగా ఎన్నికల్లో అధికార పార్టీకి తీవ్ర నష్టం కలిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

చెప్పుతో కొట్టిన ఘటనలో ముగ్గురు సీఐలపై కేసు

- ఎన్‌హెచ్‌ఆర్సీ చర్యలకు శ్రీకారం

పుంగనూరు, జనవరి 30: పుంగనూరు సమీపం చదళ్ల వద్ద ఈనెల 13వ తేది బీసీవైపీ ధర్మపోరాట సభకు అనుమతి లేదంటూ ఏర్పాట్లను పోలీసులు అడ్డుకునే క్రమంలో ఓ కార్యకర్తను చెప్పుతో కొట్టారు. దీనికి సంబంధించి ముగ్గురు సీఐలపై ఎన్‌హెచ్‌ఆర్సీ మంగళవారం కేసు నమోదు చేసినట్లు కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రాష్ట్ర మానవహక్కుల సంఘం జాయింట్ సెక్రటరీ కరుణాకర్ యాదవ్ తెలిపారు. అప్పట్లో పుంగనూరు, గంగవరం, చౌడేపల్లె సీఐలు రాఘవరెడ్డి, కృష్ణమోహన్, కృష్ణారెడ్డి సభా ఏర్పాట్లు తొలగించి, కొందరిని అరెస్టు చేశారు. ఈ క్రమంలో బీసీవైపీ కార్యకర్త వెంకటేశ్‌ను గంగవరం సీఐ కృష్ణమోహన్ చెప్పుతో కొట్టారు. దీనికి సంబంధించి న్యూఢిల్లీ జాతీయ మానవహక్కుల కమిషన్‌కు కరుణాకర్‌యాదవ్ అప్పట్లో ఫిర్యాదు చేశారు. దీంతో ముగ్గురు సీఐలపై 707/ఇన్ 2024 ప్రకారం డైరీ నెంబరు కేటాయించి మంగళవారం 93/1/3/2024 మేరకు కేసు నమోదు చేశారని ఆయన తెలిపారు.

చచ్చినా ఓటు తీయరు

- ఓటరు జాబితాలో తప్పులు సరిచేయని అధికారులు

కల్లూరు, జనవరి 30: పులిచెర్ల మండలంలోని ఓటర్ల జాబితాలను పరిశీలించే కొద్దీ తప్పులు వెలుగుచూస్తూనే ఉన్నాయి. ముసాయిదా జాబితాలోని తప్పులను తుది జాబితాలో సరిచేయలేదు. చాలావరకు అలానే ఉంచేశారంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇక, మంగళంపేట, నన్నూరివారిపల్లి, మతుకువారిపల్లి పంచాయతీల్లో మృతులకు ఓటు హక్కు కల్పించారు. మంగళంపేట పంచాయతీ 250 పోలింగ్‌స్టేషన్ పరిధిలో సతీష్ (సీరియల్ నెంబరు 278), కృష్ణమ్మ (726) రెండేళ్ల కిందట.. హసీంపల్లి (565), తాజ్‌బి (885), సుధామణి (160), 251 పోలింగ్‌స్టేషన్‌లోని చాంద్‌బి (358) ఇటీవల మృతి చెందారు. అలాగే, నన్నూరివారిపల్లి పంచాయతీ 252 పోలింగ్‌స్టేషన్ పరిధిలోని షైమూన్‌బి (414), నరసింహులు (97), ఆదినారాయణ (450), శిద్దమ్మ (411), కాంతమ్మ (610), పి.నరసింహులు (441), మతుకువారిపల్లి పంచాయతీ పోలింగ్‌స్టేషన్ పరిధిలోని నాగరత్నమ్మ (1274), వెంకట్రమణ (1291) కూడా మృతిచెందారు. అయినా, వీరంతా ఆయా ఓటర్ల జాబితాలో ఓటర్లే. మరి ఆత్మలొచ్చి ఓట్లేస్తాయా?




ఓటర్ల జాబితాలో ఉన్న మృతుల ఓట్లు

అత్తారింటికి వెళ్లినా.. పుట్టింట ఓటర్లే




నన్నూరివారిపల్లి పంచాయతీ 252 పోలింగ్‌స్టేషన్ పరిధిలో మమత (సీరియల్ నెంబరు 59), సౌజన్య(334), యామిని(408), మంగళంపేట 250వ పోలింగ్‌స్టేషన్ పరిధిలో బబిత(589), కరిష్మా (676), సదాఫ్ (934), మతుకువారిపల్లి పంచాయతీ పరిధిలోని 233 పోలింగ్‌స్టేషన్ పరిధిలో రెడ్డెమ్మ (1265), నందిని (1360) పెళ్లయి అత్తారిళ్లకు వెళ్లారు. అయినా, వీరందరికీ పుట్టిన ఊరులోనూ అధికారులు ఓటుహక్కు కొనసాగిస్తున్నారు.

పురుషుడి పేరుకు మహిళ ఫొటో



మతుకువారిపల్లి పంచాయతీ 233 పోలింగ్‌స్టేషన్ పరిధిలో సీరియల్ నెంబర్ 80లో పవన్‌కుమార్ కోడి, తండ్రి పేరు వెంకటరమణ కోడిగా ఓటు ఉంది. ఈ పురుష ఓటరుకు మహిళ ఫొటో ఉంది. ఈ ఐడీ నెంబరుకు ఎవరికి ఓటు హక్కుకల్పించాలో అధికారులే నిర్ణయించాలి.

డబుల్ ఎంట్రీలు షరా మామూలే..



నన్నూరివారిపల్లి పంచాయతీ 252 పోలింగ్‌స్టేషన్ పరిధిలోని సీరియల్ నెంబరు 194లో గులాబి మొగల్, భర్త పేరు జాకీర్ హుస్సేన్ మొగల్, ఇంటి నెంబరు 7-37గా ఉంది. ఇదే జాబితాలో సీరియల్ నెంబరు 195లో గులాబి ఎం, భర్త పేరు జాకీర్‌హుస్సేన్ ఎం, ఇంటి నెంబరు 7-37గా ఉంది. ఒకే పోలింగ్‌స్టేషన్ ఓటర్ల జాబితాలో వరుసగా డబుల్ ఎంట్రీ ఉన్నా అధికారులకు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది.


ప్లీజ్.. ప్లీజ్.. పేపర్లలో రాయొద్దు!

పలమనేరు : పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని 257 పోలింగ్ బూత్‌లో తెలుగుదేశం పార్టీకి చెందిన దాదాపు 16 మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. పూజారి గని, శ్యామలమ్మ, మునిరత్నమ్మ, సుల్తాన్, మిరాసుల్తాన్, ఈశ్వరప్ప, బాబ్రాన్, దిల్‌షాద్, ఎం.సుగుణ, ఈశ్వర్, శారద, మంజుల, షబ్రీన్, నీలిమ, గీత, ప్రమీల పేర్లను ఓటర్ల జాబితానుంచి అక్రమంగా తొలగించి ఉన్నారంటూ ఆ పోలింగ్ బూత్ టీడీపీ ఇన్‌చార్జి గుర్తించారు. ఈ విషయాన్ని సచివాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు నీళ్లు నమిలారు. పేపర్ల లో రాకుండా చూడాలని ఇది పొరబాటున తొలగించడం జరిగిందని, అక్రమంగా తొలగించిన వారందరిపేర్లు మళ్లీజాబితాలో చేరుస్తామని టీడీపీ నాయకులకు చెప్పడం గమనార్హం.



పోలింగ్ బూత్‌లో తొలగించిన ఓట్లలో కొందరివి


ఊరొదిలి వెళ్లినా ఓటర్లే




ఇరవై ఏళ్ల క్రితమే ఊరొదిలి వెళ్లినా ఓటరుగా ఉన్న దాక్షాయణి

వెదురుకుప్పం: తుది ఓటర్ల జాబితాలోనూ వెదురుకుప్పం మండలంలో తప్పిదాలు వెలుగులోకి వస్తున్నాయి. పచ్చికాపల్లం గ్రంధాలయంలో విధులు నిర్వహించిన దాక్షాయణి(62)కి ఇక్కడ ఓటు హక్కు ఉండేది. ఆమె దాదాపు ఇరవై సంవత్సరాల కిందట బదిలీపై ఊరొదిలి వెళ్లారు. అయినా, పచ్చికాపల్లంలో క్రమ సంఖ్య-492లో ఇంటి క్రమ సంఖ్య-5-156తో ఆమెకు ఓటు ఇచ్చారు. అలాగే, పచ్చికాపల్లంకు చెందిన ఎం.ఎస్ ఖాన్(59) పదేళ్ల కిందట ఊరొదిలి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అతడికీ క్రమ సంఖ్య-397తో ఇంటి సంఖ్య-5-171బి అని ఓటు హక్కు ఉంది.


డబుల్ ధమాకా





రెండు ఓట్లున్న మురళి

పచ్చికాపల్లంకు చెందిన కె.చెంగారెడ్డి కుమారుడు కె.మురళికి క్రమ సంఖ్య-392లో ఇంటి నెంబరు 5-158ఏగా ఓటు ఉంది. అలాగే, క్రమ సంఖ్య-503లో మురళీరెడ్డిగా పేరు చూపి ఇంటి క్రమ సంఖ్య-5-158గా చూపించి ఇంకో ఓటు కల్పించారు.



ఓటరు జాబితాలో నారాయణ పేరు

ఆత్మలకూ ఓట్లు

పుంగనూరు: పుంగనూరు మండలంలో ఆత్మలకూ ఓటు హక్కు కల్పించారు అధికారులు. ఇలాంటి వాటిని ముసాయిదా జాబితాలో గుర్తించి చెప్పినా..తుది జాబితాలోనూ అలాగే ఉంచారు. రాంపల్లెకు చెందిన సీ.నారాయణ (టీవీఎఫ్ నెంబరు 1054965)కు భీమగానిపల్లె పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు ఉంది. కాకుంటే ఓటేసేందుకు ఆయన బతికి లేరు. కంగానెల్లూరులోనే ముద్దప్ప భార్య బి.తిమ్మక్క మృతిచెందినా.. మంగళం పోలింగ్ కేంద్రంలో టీవీఎఫ్1687854తో ఓటు హక్కు కల్పించారు.



రెండు ఓట్లున్న సుజాత

కవతంపల్లెకు చెందిన నాగరాజ భార్య డి.సుజాతకు వరుస సంఖ్య 96లో టీవీఎఫ్ 1236330 నెంబరుతో.. వరుససంఖ్య 97లో టీవీఎఫ్ 1396720 నెంబరుతో రెండు ఓట్లున్నాయి. అలాగే,శంకరప్ప కుమారుడు గుర్రప్పగారి జయకృష్ణకు వరుస సంఖ్య 92లో టీవీఎఫ్ 1203439, వరుససంఖ్య66లో టీవీఎఫ్ 1373539లో రెండు ఓట్లున్నాయి. భీమగానిపల్లె పోలింగ్ కేంద్ర ఓటర్ల జాబితాలో ఇలా డబుల్ ఎంట్రీలు కనిపించాయి.

కులమే కాదు.. ఆస్తుల గణన కూడా..

- కులం చెప్పేందుకు ప్రజల అనాసక్తి
- ఆస్తుల వివరాలు మీకెందుకంటూ నిలదీత
- సర్వర్ సమస్యతో వలంటీర్ల తంటాలు
- 77.87 శాతం కుటుంబ సభ్యుల సర్వే పూర్తి
- 2 వరకు గడువు పొడిగింపు

చిత్తూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పేరుకు కుల గణన సర్వే అయినా, ఆస్తులు, వ్యక్తిగత వివరాలూ సేకరిస్తున్నారు. దీనిపై వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ప్రజలు నిలదీస్తున్నారు. ఈనెల 19 నుంచి కుల గణన సర్వే మొదలు పెట్టారు. కుల గణన సర్వే యాప్‌లో కుటుంబ సభ్యులందరి ప్రాథమిక వివరాలను నమోదు చేస్తారు. ఈ క్రమంలో కులం చెప్పేందుకు పలువురు అనాసక్తి చూపుతున్నారు. ఇప్పుడు ఎన్నికల సమయంలో కుల వివరాలు ఎందుకు అడుగుతున్నారంటూ నిలదీస్తున్నారు. అలాగే, వ్యవసాయ భూమి విస్తీర్ణం, నివాస స్థలం విస్తీర్ణం, ఇంటి రకం వంటి ప్రశ్నలను అడుగుతున్నారు. కోళ్లు, పందులు, మేకలు, గొర్రెలు వంటి పశువు లెక్క కూడా నమోదు చేయాల్సి ఉంది. ఆస్తి వివరాలు చెప్పడానికి ప్రజలు జంకుతున్నారు. తమ ఆస్తి వివరాలు చెప్పేందుకు వెనకడుగు వేయడంతోనే జిల్లాలో సర్వే పూర్తి కాలేదు. ఇక, సర్వర్ కూడా మొరాయిస్తోంది. ఈ సమస్యలతో జిల్లాలో ఇంకా 12.15 శాతం కుటుంబాల, 22.13 శాతం కుటుంబ సభ్యుల సర్వే పెండింగులో ఉంది. దీంతో ఆదివారంతో ముగిసిన సర్వే గడువును.. ఫిబ్రవరి 2వ తేదీ వరకు పెంచారు.



చిత్తూరు సంతపేటలో సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగి, వలంటీరు

ఓటీపీ చెప్పేందుకు వెనుకంజ

ఒక సచివాలయ పరిధిలో ఓ కుటుంబం మ్యాపింగ్ అయి ఉంటుంది. కానీ ప్రస్తుతం వాళ్లు వేరేచోటికి మారిపోయి ఉంటారు. సర్వే సమయంలో సచివాలయ ఉద్యోగులు ఇంటికి వస్తే వేలిముద్రలు తీసుకోవడానికి అక్కడ ఆ కుటుంబం ఉండదు. అలాంటి సమయంలో వాళ్లకు ఓటీపీ పంపిస్తారు. అలాగే, ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులు అందుబాటులో లేనప్పుడు వారి సెల్‌ఫోన్‌కు ఓటీపీ పంపించి సర్వే చేయవచ్చు. అయితే, ఉద్యోగులకు ఆ ఓటీపీ వివరాలు చెప్పేందుకు చాలామంది వెనుకంజ వేస్తున్నారు. సర్వర్ మొరాయించడం వల్ల మూడు నాలుగు సార్లు ఓటీపీ వివరాలు అడగడంతో కొందరు కసురుకుంటున్నారు. దీంతో చేసేదేమీలేక అలాంటి ఇళ్ల సర్వేను పెండింగులో ఉంచుతున్నారు.

సర్వర్ మొరాయింపుతో ఇబ్బందులు

వలంటీర్ యాప్‌లోనే కుల గణన సర్వేకు సంబంధించిన విభాగం ఉంటుంది. సర్వర్ సమస్యతో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 6 నుంచి 9 వరకు, సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు మాత్రమే సర్వర్ పనిచేసేది. ఓ సర్వే పూర్తి చేయాలంటే తొలుత కుటుంబ సభ్యుడు, తర్వాత సచివాలయ ఉద్యోగి, చివర్లో వలంటీర్ వేలిముద్ర వేసి యాప్‌లోని ప్రశ్నల్ని నింపుతారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక చివర్లోనూ ముగ్గురు వేలిముద్రలు వేయాలి. కార్యాలయాల పనివేళల్లో కాకుండా ఉదయం, రాత్రి మాత్రమే సర్వర్ పనిచేయడంతో ఇబ్బంది తలెత్తుతోంది.

జిల్లాలో కుల గణన సర్వే వివరాలు

మొత్తం సచివాలయాలు: 612
కుటుంబాలు: 5,90,589
కుటుంబ సభ్యులు: 18,76,761
సర్వే పూర్తయిన కుటుంబాలు: 5,18,847 (87.85%)
సర్వే పూర్తయిన కుటుంబ సభ్యులు : 14,61,493 (77.87%)
పెండింగులో ఉన్న కుటుంబాలు : 71,742 (12.15%)
పెండింగులో ఉన్న కుటుంబ సభ్యులు : 4,15,268 (22.13%)

మా అకౌంట్‌లో డబ్బులు పోతే బాధ్యత మీదే?

పెద్దపంజాణి మండలం వీరప్పల్లి గ్రామ సచివాలయ పరిధిలో ఓ ఉద్యోగి, వలంటీరు కుల గణన సర్వే చేసేందుకు వెళ్లారు. ఓ కుటుంబ పెద్దను వేలిముద్ర పెట్టమని అడిగారు. 'కుల సర్వేకు వేలిముద్ర ఎందుకు? నా బ్యాంకు అకౌంట్‌లో డబ్బులున్నాయి. అవి పోతే మీరు బాధ్యత వహిస్తారా?' అంటూ ఇంటి యజమాని ప్రశ్నించారు.

వేలిముద్రలతో రూ.లక్ష కాజేసిన వలంటీరు

పెద్దపంజాణి మండలం లింగాపురం సచివాలయం పరిధిలో ఓ వలంటీరు.. బ్యాంకు ఏజెంటుగా కూడా పనిచేసేవాడు. గతంలో వైఎస్సార్ చేయూత పథకం వర్తించేందుకని లబ్ధిదారుడి వద్ద వేలిముద్ర తీసుకుని అతడి బ్యాంకు అకౌంట్‌లో నుంచి రూ.30 వేలను విత్‌డ్రా చేసుకున్నాడు. ఆ వలంటీరే మరోచోట పెన్షన్ లబ్ధిదారుడి వద్ద తొలుత వేలిముద్ర వేయించుకుని, సరిగ్గా పడలేదని రెండోసారి కూడా వేయించుకున్నాడు. ఓసారి వేలిముద్ర వేయించుకుని పెన్షన్ ఇవ్వగా, మరోసారి తీసుకున్న వేలిముద్రతో లబ్ధిదారుడి అకౌంట్‌లోని రూ.12 వేలు కాజేశాడు. తన 50 ఇళ్ల పరిధిలోనే సుమారు రూ.లక్షకుపైగా ఇలా విత్‌డ్రా చేయడంతో బాధితులు పోలీసుల్ని ఆశ్రయించారు. గ్రామ పెద్దలు పంచాయితీ పెట్టి ఆ మొత్తాన్ని అతడి నుంచి రికవరీ చేశారు. ఆ ఉదంతాన్ని గుర్తు చేసుకుని ఆ మండలంలో వేలిముద్రలు వేసేందుకు ప్రజలు భయపడుతున్నారు.

కల్లూరు టీచరుకు హరిత పాఠశాల అవార్డు



కల్లూరు, జనవరి 30: పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు మూడోసారి జాతీయస్థాయిలో హరిత పాఠశాల అవార్డు లభించింది. ఈ అవార్డును మంగళవారం ఢిల్లీలో ఇండియా హాబిటట్ సెంటర్‌లో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ డైరెక్టర్ జనరల్ సునీత నరైన్ చేతులు మీదుగా ఉపాధ్యాయుడు, ఎన్జీసీ గ్రీన్ మాస్టర్ వెంకటశిద్దులు అవార్డును అందుకున్నారు.

చిన్న పనులూ చేయలేకపోతున్నాం

● పంచాయతీ నిధులు దారి మళ్లిస్తున్నారంటూ సర్పంచుల నిరవధిక దీక్ష



చిత్తూరు, జనవరి 30: గ్రామాల్లో చిన్న చిన్న పనులు చేయడానికి కూడా నిధుల్లేకుండా అల్లాడే పరిస్థితి నెలకొందని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు అన్నారు. చిత్తూరు కలెక్టరేట్ వద్ద మంగళవారం సర్పంచులు చేపట్టిన నిరవధిక రిలే నిరాహారదీక్షలో ఆయన మాట్లాడారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఓవర్ హెడ్ ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్ చల్లే పరిస్థితి కూడా లేదన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సర్పంచ్‌ల హక్కులను కాలరాశారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. వీరి దీక్షకు టీడీపీ నేతలు దొరబాబు, చంద్రప్రకాష్, కఠారి హేమలత, సీఆర్ రాజన్ సంఘీభావం తెలిపారు. పంచాయతీ నిధులను దారి మళ్లించడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక పంచాయతీ వ్యవస్థ కనుమరుగైపోయిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన వారు గ్రామాల్లో పనులు చేయకపోవడంతో ప్రజల నుంచి ఛీత్కారాలను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ దీక్షలో సర్పంచుల సంఘం నేతలు చుక్కా ధనుంజయ యాదవ్, కుప్పాల మురళి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలి

● రెండో రోజు కొనసాగిన సెర్ప్ ఉద్యోగుల దీక్ష



చిత్తూరు, జనవరి 30: ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలంటూ సెర్ప్ ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరింది. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైఎస్సార్ క్రాంతి పథంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మినిమం స్కేల్‌ను వర్తింపచేయాలని, హెచ్‌ఆర్‌పీ, ఈపీఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి మోహనకృష్ణ డిమాండు చేశారు. సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు దీక్షను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఆ సంఘ నేతలు ప్రభాకర్, రజని, సుధాకర్, ఉమాపతి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రికెట్ పోటీల్లో సత్తా చాటిన గణేష్



గణేష్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్

శ్రీరంగరాజపురం, జనవరి 30: ఎస్ఆర్‌పురం మండలం తయ్యూరు పంచాయతీ 50 బసివిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గణేష్ అంతర్జాతీయ దివ్యాంగుల టీ-20 క్రికెట్ సిరీస్‌లో పాల్గొన్నారు. నేపాల్‌పై ఘన విజయం సాధించిన భారత్ జట్టులో కీలకంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా 49.కొత్తపల్లెమిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి అయిన గణేష్‌ను మంగళవారం పాఠశాలలో తహసీల్దార్ బెన్నూరాజ్, హెచ్ఎం శాంతి, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ విజయబాబు సన్మానించారు. రెడెప్ప నాయుడు, మహ్మద్ సాకేత్, ప్రభాకర్‌రెడ్డి, షణ్ముగం, ధనంజయ, శిండి ప్రసాద్, రమేష్, గాయత్రి, హేమలత పాల్గొన్నారు.

దుర్గసముద్రం అడవిలో పులి సంచారం

● మృతి చెందుతున్న పశువులు

చౌడేపల్లె, జనవరి30: చౌడేపల్లె మండలం దుర్గసముద్రం సమీప అడవిలో పులి సంచరించి పశువులపై దాడి చేస్తోందని గ్రామస్తులు మంగళవారం తెలిపారు. ఈ పంచాయతీలోని గాండ్లపల్లెకు చెందిన రైతుల ఆవులు, మేకలు వారం రోజుల నుంచి మేపు వెళ్లి తిరిగి రావడం లేదు. ఈ క్రమంలో సోమవారం రైతు జల్లప్ప తన మేకలను మేత కోసం అడ్డగుట్ట సమీపంలో మేపుకొని ఇంటికి తిరిగొచ్చారు. మందలో రెండు మేకలు కనిపించకపోవటంతో సమీప రైతులతో కలిసి మంగళవారం అటవీ ప్రాంతంలో వెదికారు. అంకాలమ్మ గుడి సమీపంలోని తలమడుగు అటవీప్రాంతంలో వెంకటరమణకు చెందిన వారం ముందు తప్పిపోయిన పాడి ఆవు కళేబరం కనిపించింది. ఆవు మృతి చెందిన విధానం పరిశీలించగా పులి దాడి చేసినట్లు గుర్తించారు. పశువులపై పులి దాడి చేయటం తాము చూసినట్లు అక్కడి యానాదులు చెప్పారని గ్రామస్తులు అంటున్నారు. దీంతో వీరు పశువులను మేత కోసం అటవీప్రాంతం వైపు తోలుకెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు.

కుక్కల దాడిలో గాయపడ్డ నెమలి



నెమలిని అటవీశాఖ అధికారులకు అందజేస్తున్న రైతు సురేంద్ర

బంగారుపాళ్యం, జనవరి 30: వీధికుక్కల దాడిలో నెమలి గాయపడింది. కుక్కల నుంచి తప్పించుకుని నలగాంపల్లె సమీపంలోని ఎన్‌పీ సురేంద్ర నాయుడు మామిడి తోటలో మంగళవారం స్పృహ కోల్పోయి పడి ఉంది. దీనిని గమనించిన ఆ రైతు నెమలికి ప్రథమ చికిత్స అందించారు. ఈయన సమాచారంతో ఎఫ్ఎస్‌వో శివకుమార్ అక్కడికి చేరుకుని నెమలిని చిత్తూరు రేంజ్ ఆఫీసుకు తరలించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాలేవీ?

చిత్తూరు రూరల్, జనవరి 30: చిత్తూరు నియోజకవర్గానికి సంబంధించి తుది ఓటర్ల జాబితాలు ఆయా పోలింగ్ కేంద్రాల్లో, ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ జాబితాలో ఏవైనా తప్పులుంటే ఓటర్లు పరిశీలించుకొని సవరణ చేసుకోవచ్చని సూచించారు. అయితే ఇప్పటి వరకు నియోజకవర్గంలోని ఏ పోలింగ్ కేంద్రాల వద్ద కూడా ఓటర్ల జాబితా అందుబాటులో లేదు. జాబితాలో తమ ఓటు ఉందా లేదా అనేది ఎలా చూసుకోవాలంటూ ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. పేరుందా లేదా అని తెలుసుకోవాలంటే ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాలకు ఎలా రావాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ వచ్చినా వందలాది పేజీలున్న జాబితాలో తమ పేర్లను ఎలా కనుగొనాలో తెలియక ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారు. జాబితాపై బీఎల్‌వోలను అడిగినా సమాధానం ఇవ్వడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను ప్రచురించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే బదులు 'ఆసరా'కు వైసీపీ ఇన్‌చార్జి



ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న వైసీపీ నాయకులు

బంగారుపాళ్యం, జనవరి 30: ప్రభుత్వ కార్యక్రమల్లో ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు కాకుండా వైసీపీ ఇన్‌చార్జి సునీల్ కుమార్ పాల్గొంటున్నారు. బంగారుపాళ్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన డ్వాక్రా సంఘాలకు ఆసరా చెక్కును అందించారు. ఎంపీపీ అమరావతి, కన్వీనర్ రామచంద్రారెడ్డి, జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు దత్తాత్రేయ రెడ్డి, సర్పంచులు ఉమాదేవి కృష్ణమూర్తి, వాణిప్రియ, ఎల్లప్ప, కిశోర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కామరాజ్ ఫామ్‌హౌస్‌లో సునీల్ విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి పెద్దిరెడ్డికి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.







బెంచీని ఎత్తనీయకుండా అడ్డుకుంటున్న టీడీపీ నేతలు, వాకర్స్ - బెంచీలను లారీలో ఎక్కిస్తున్న నగరపాలక సిబ్బంది - పోలీసులతో దొరబాబు, నేతల వాగ్వాదం

బెంచీలు తీసేయాల్సిందే

● ఏమైనా ఉంటే తర్వాత మాట్లాడుకుందాం
● కమిషనరు అత్యుత్సాహం
● కట్టమంచి చెరువు కట్టపై జీజేఎం ట్రస్టు ఏర్పాటు చేసిన బెంచీల తొలగింపు
● వైసీపీ నేతల ఒత్తిడితో ఇలా చేశారంటూ టీడీపీ ఆగ్రహం

చిత్తూరు, జనవరి 30: వాకింగ్ సమయంలో సేద తీరేందుకు బెంచీలు ఏర్పాటు చేయాలని వాకర్స్ అడిగారు. ఆ మేరకు చిత్తూరు కట్టమంచి చెరువు కట్టపై జీజేఎం ట్రస్టు ఛైర్మన్, టీడీపీ నేత గురజాల జగన్మోహన్ బెంచీలు ఏర్పాటు చేశారు. వీటికి అనుమతి లేదంటూ మంగళవారం నగరపాలక సంస్థ అధికారులు వచ్చి తొలగించేందుకు యత్నించారు. ప్రజావసరాలకు ఏర్పాటు చేశామని.. అనుమతికి దరఖాస్తు చేసుకుంటామని టీడీపీ నేతలు చెప్పినా పట్టించుకోలేదు. ముందు తీసేయండి.. ఏమైనా ఉంటే ఆ తర్వాత మాట్లాడుకుందామంటూ కమిషనరు అరుణ స్పష్టంచేశారు. మున్సిపల్ అధికారుల అత్యుత్సాహం వెనుక వైసీపీ నేతలు ఉన్నారంటూ టీడీపీ నేతలు ఆగ్రహించారు. ఆరు నెలలుగా జీజేఎం ట్రస్టు తరపున గురజాల జగన్మోహన్ చిత్తూరు నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో వాకర్స్ అసోసియేషన్ నేతల విజ్ఞప్తి మేరకు రెండు రోజుల కిందట కట్టమంచి చెరువు కట్ట మీద బెంచీలను ఏర్పాటు చేశారు. వాటిపై గురజాల జగన్మోహన్, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మన్ అని ఉంది. బెంచీలకు పసుపు రంగు ఉంది. నగరపాలక అధికారులు మంగళవారం అక్కడకు చేరుకుని బెంచీలు పెట్టడానికి అనుమతి లేదని, తొలగించాలన్నారు. దీనిపై టీడీపీ నాయకులు.. వాకర్స్ అధికారుల మధ్య వాగ్వాదం జరుగుతుండగానే సిబ్బంది బెంచీలను లారీలో పెట్టేశారు. ఈ క్రమంలో కొన్ని విరిగిపోయాయి.

అధికారులను నిలదీసిన టీడీపీ నేతలు

టీడీపీ శ్రేణులతో పాటు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, పలువురు నేతలు అక్కడికి చేరుకున్నారు. ఇరిగేషన్‌కు సంబంధించి స్థలంలో బెంచీలను ఏర్పాటు చేస్తే నగరపాలక అధికారులకు అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. వాకర్స్, ప్రజలు సేదతీరడం వల్ల కలిగే నష్టమేంటని నిలదీశారు. నగరంలోనూ వైసీపీ ఫ్లెక్సీలను వదిలేసి తమవే తీసేయడంలో ఆంతర్యం ఏమిటంటూ ఆగ్రహించారు. వైసీపీ అరాచకాలకు అంతు లేకుండా పోతోందన్నారు. ప్రజలకు మంచి చేయక పోగా చేసే వారిని అడ్డుకోవడం తగదన్నారు. అనుమతి కోసం రెండు రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా, కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ఆలస్యమైందన్నారు. అధికారులు చేయాల్సిన పనిని దాతలు చేస్తుంటే ప్రోత్సహించాల్సింది పోయి అడ్డుకోవడం దారుణమన్నారు. సంఘటనా స్థలం వద్ద టీడీపీ నేతలిచ్చే వివరణనూ కమిషనరు అరుణ పట్టించుకోలేదు. బెంచీలను తొలగించాలంటూ కార్మికులను ఆదేశించారు. 'వాకర్స్ అడిగితే ఏర్పాటు చేశాం. ఇప్పుడు అనుమతికి దరఖాస్తు చేసుకుంటాం. పసుపు రంగు తీసేసి వేరే రంగు వేస్తాం. వీటిని తొలగించకండి' అని టీడీపీ నాయకులు, జగన్మోహన్ కార్యాలయ సిబ్బంది చెప్పినా ఆమె పట్టించుకోలేదు. దీంతో వారు బెంచీలను తీసుకెళ్లిపోయారు.

ఫ్లెక్సీల తొలగింపులోనూ పక్షపాతం

ఈనెల 15వ తేదీన గురజాల పుట్టినరోజు సందర్భంగా నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను 17వ తేదీనే అధికారులు దగ్గరుండి తొలగించారు. అనేక ప్రధాన సర్కిళ్లలో వైసీపీ నేతల బ్యానర్లున్నా పట్టించుకోలేదని టీడీపీ ఆరోపిస్తోంది. ఈ నెల 24న నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా 50 ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి కోరితే రోజంతా వేచి ఉన్నాక 30కి అనుమతి ఇచ్చారు.



తొలగించే క్రమంలో దెబ్బతిన్న బెంచీలు

ముద్దనపల్లెలో జల్లికట్టు





జనసమూహం మధ్య దూసుకెళ్తున్న ఎద్దులు

రామకుప్పం, జనవరి 30: రామకుప్పం మండలం ముద్దనపల్లెలో మంగళవారం జల్లికట్టు నిర్వహించారు. దీనిని చూసేందుకు వచ్చిన వారితో గ్రామం జనసంద్రంగా మారింది. జల్లికట్టు పరుగుపందెంలో గెలిచే ఎద్దులకు ముందుగానే బహుమతులు ప్రకటించారు. తొలి ఆరు బహుమతుల కింద వరుసగా రూ.లక్ష, రూ.75వేలు, రూ.50వేలు, రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలతో పాటు మరో 19 నగదు బహుమతులు, మరో 81బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు 15 రోజులుగా ప్రచారం చేశారు. దీంతో వందలాది మంది రైతులు తమ ఎద్దులను తీసుకొచ్చారు. గంగమ్మ ఆలయంలో పూజల అనంతరం డప్పుల హోరు మధ్య తమ ఎద్దులను బరిలో పరుగులు తీయించారు. మెరుపు వేగంతో దూసుకెళ్తున్న ఎద్దులను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. ఈ క్రమంలో ఒకరిద్దరికి.. ఓ ఎద్దుకు గాయాలయ్యాయి. సాయంత్రం ఎద్దుల యజమానులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

3500 టన్నుల రాగులు వెనక్కి

కార్డుదారుల అనాసక్తి.. మార్చి నుంచి రాగిపిండి ఇస్తారంట

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 30: నెలల తరబడి మండల స్థాయి స్టాక్ పాయింట్లలో నిల్వ ఉన్న 3500 టన్నుల రాగులను ఎట్టకేలకు జిల్లా యంత్రాంగం వెనక్కి పంపింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొన్ని మండలాలు మినహా మెజార్టీ మండలాల్లో రాగుల వినియోగం తక్కువే. గతేడాది జూలై నుంచి బియ్యం స్థానంలో ప్రతి కార్డుదారుకు మూడు కిలోల రాగులను పంపిణీ చేశారు. నాసిరకంగా ఉన్నాయంటూ వీటిని తీసుకునేందుకు కార్డులు అనాసక్తి చూపారు. దాంతో రాగులు ఎం.ఎల్. పాయింట్లలో నెలలతరబడి నిల్వ ఉండిపోయాయి. ఎండలకు, వర్షానికి పాడైపోయాయి. రెండు నెలల క్రితం జేసీ శ్రీనివాసులు బియ్యం స్థానంలో రాగులను తీసుకుని పంపిణీ చేయాలని డీలర్లపై ఒత్తిడి తెచ్చినా తీసుకెళ్లలేదు. కాగా, నిల్వవున్న రాగులను మిల్లింగ్‌చేసి మార్చి నుంచి కేజీ ప్యాకెట్ల రూపంలో ఉచితంగా రాగిపిండి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో అధికారుల సూచన మేరకు నిల్వవున్న రాగులను వారం కిందట సమీప మిల్లులకు పంపించారు.

జగన్ ఎన్ని కుట్రలు చేసినా బాబు వెంటే జనం : అమర్



పలమనేరు, జనవరి 30: సీఎం జగన్‌రెడ్డి ఎన్నికుట్రలు చేసినా రాష్ట్ర ప్రజలంతా బాబు వెంటే ఉన్నారని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్‌రింగ్‌రోడ్డు కేసులో ముందస్తు బెయిల్ రద్దుచేయాలని ప్రభుత్వం వేసిన పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడాన్ని ఆయన స్వాగతించారు. పలమనేరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబును ఇబ్బంది పెట్టాలని చూస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తీర్పు ఒక చెంపపెట్టు లాంటిదన్నారు. సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికైనా జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. నిజం గెలవడానికి ఆలస్యం కావచ్చుగానీ ఖచ్చితంగా గెలుస్తుందని జగన్‌రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. ఆయన అనాలోచిత చర్యల కారణంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు వైసీపీని వీడుతున్నారని పేర్కొన్నారు. పార్టీలో తన ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి ఎమ్మెల్యేలను మరో సీటుకు జగన్ మారుస్తున్నారంటూ విమర్శించారు. తనకు కేటాయించిన తిరుపతి లోక్‌సభ సీటును సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తిరస్కరించడాన్ని ఆయన ప్రస్తావించారు.

పకడ్బందీగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు : ఆర్ఐవో



మాట్లాడుతున్న ఆర్ఐవో ప్రభాకర్‌రెడ్డి, పక్కనే డీఈసీ సభ్యులు

తిరుపతి(విద్య), జనవరి 30: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఐవో జీవీ ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. తిరుపతిలోని ఎస్వీజూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్స్, హైస్కూల్స్ ప్లస్ హెచ్‌ఎంలతో సమీక్షించారు. ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 5నుంచి 20 తేదీవరకు మూడు స్పెల్స్‌లో, జనరల్ కోర్సులకు అదేనెల 11నుంచి 20వ తేదీవరకు రెండు స్పెల్స్‌లో పరీక్షలు జరుగుతాయని వివరించారు. 138 కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు 22,454మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఉంటాయని చెప్పారు. ప్రత్యేక అధికారి విశ్వనాథనాయక్, డీఈసీ సభ్యులు డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి, ఎ.రఘుపతి, తులసీ రామిరెడ్డి, వి.బాబుపాల్గొన్నారు.

2న ఎథిక్స్, 3న పర్యావరణ విద్య పరీక్ష

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర జనరల్, ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు ఫిబ్రవరి 2న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 3న పర్యావరణ విద్య పరీక్షలు జరుగుతాయి. ఈపరీక్షలకు విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని, ఈపరీక్ష పాసైతేనే ఇంటర్ ఉత్తీర్ణులైనట్లు పెద్ద మార్కుల జాబితా వస్తుందని ఆర్ఐవో తెలిపారు. గతంలో ఈ పరీక్షకు హాజరుకాని(2014-15నుంచి గతేడాదివరకు) విద్యార్థులు కూడా పరీక్షను రాసే వెసులుబాటు ఉందని చెప్పారు.

అగ్రరాజ్యంలో మెరిసిన అనంత రవి తేజం

అమెరికాలో ఈబీ-1 వీసా పొందిన తిరుపతి యువకుడు
యాపిల్ కంపెనీ రీసెర్చ్ సైంటిస్ట్‌గా రూ. 5.3 కోట్ల వార్షిక వేతనం



యాపిల్ కంపెనీ సీఈవో టిమ్ కుక్‌తో..

తిరుపతి రూరల్, జనవరి 30: అగ్రరాజ్యం అమెరికాలో అనంత రవితేజ అనే తెలుగు యువకుడు మెరిశాడు. తిరుపతికి చెందిన ఇతను ఈబీ-1 వీసా (ఐన్‌స్టీన్ వీసా) పొందాడు. అసాధారణ ప్రతిభను చూపిన వ్యక్తులకు మాత్రమే ఇలాంటి గుర్తింపు లభించడం గమనార్హం. దీనిపై తిరుపతి నలంద నగర్‌లో ఉంటున్న ఈయన తల్లిదండ్రులు నీలిమ, రమేష్ నాయుడితోపాటు నగరవాసులూ హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తమ కుమారుడికి ఈబీ-1 వీసా రావడం సంతోషంగా ఉందన్నారు. తమ స్వగ్రామం చంద్రగిరి మండలం పుల్లయ్యగారిపల్లె అని తెలిపారు.

ప్రస్థానమిలా..

తిరుపతి బాలాజీ కాలనీలోని కేంబ్రిడ్జ్ స్కూల్లో రవితేజ ప్రాథమిక విద్యాభ్యాసం, బెంగళూరులో బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్, న్యూయార్క్ యూనివర్సిటీలో ఎంఎస్, హార్వర్డ్ యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేశారు. తొలుత అమెరికాలో బ్లూబర్గ్ కంపెనీలో రీసెర్చ్ ఇంజనీర్‌గా ఏడాదిపాటు పనిచేశారు. వాషింగ్టన్ స్టేట్‌లో ఉన్న యాపిల్ కంపెనీలో పలు స్థాయిల్లో పనిచేసి, రూ.5.3 కోట్ల వార్షిక వేతనంతో ఏడాది కిందట ప్రిన్సిపల్ రీసెర్చ్ సైంటిస్ట్‌గా పదోన్నతి పొందాడు. ఈక్రమంలో రవితేజకు ఈబీ-1వీసా మంజూరు చేయాలన్న యాపిల్ కంపెనీ చేసిన విన్నపాన్ని అమెరికన్ ప్రభుత్వం ఆమోదించింది. ఈబీ-1 వీసీ ద్వారానే ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అమెరికాలో అడుగు పెట్టారు. అమెరికన్ జర్నల్స్‌కు పదబంధాల(క్రాస్ వర్డ్స్)ను రూపొందించిన ముంబై వాసి మంగేష్ గోగ్రేకు కూడా ఇటీవల అమెరికా ప్రభుత్వం ఈబీ-1 వీసాను ప్రకటించిన విషయం తెలిసిందే.



జీవన ప్రమాణాలు పెంపొందించడానికి కృషి చేస్తా

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి లోతైన పరిశోధన చేయాలని ఉంది. దీనిద్వారా అన్ని రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా జీవన ప్రమాణాల పెంపొందించేందుకు కృషి చేస్తా. ఇందుకోసం స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి.. తద్వారా ప్రతిభ గల పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయాలని భావిస్తున్నా.

- అనంత రవి తేజ

రిజిస్ట్రేషన్లకు చివరి వేలిముద్ర లేదిక

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 30: ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో క్రయవిక్రయదారుల నుంచి చివరి వేలిముద్ర స్వీకరణకు ప్రభుత్వం మంగళం పాడింది. ఈ మేర మార్పులు చేస్తూ జారీ అయిన జీవో.. మంగళవారం నుంచే అమల్లోకి వచ్చింది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే రిజిస్ట్రేషన్లకు క్రయవిక్రయదారుల ఫొటోలు, వారి ఆధార్‌కార్డు నెంబర్లతో దస్తావేజు తయారవుతుంది. ఈకేవైసీ చేశాక క్రయవిక్రయదారులు వేలిముద్రలు వేస్తారు. వాటిని ఆన్‌లైన్‌లో సబ్‌రిజిస్ట్రార్ అథెంటికేషన్ చేస్తారు. దాంతో ఆ దస్తావేజుకు సంఖ్య వస్తుంది. దానిపై సబ్‌రిజిస్ట్రార్ ఈ-సైన్ చేస్తారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ సమక్షంలో క్రయవిక్రయదారులు చివరిసారిగా వేలిముద్రలు వేస్తారు. వారితో పాటు ఇరువురు సాక్షులు డాక్యుమెంట్ చివరిపేజీలో సంతకాలు చేస్తారు. రిజిస్ట్రేషన్ చివరిలో దస్తావేజులు నిబంధనల మేర ఉన్నాయంటూ సబ్‌రిజిస్ట్రార్ సంతృప్తి పొంది ఈ-సైన్ చేయడంతో రిజిస్ట్రేషన్ కార్యక్రమం పూర్తవుతుంది. ఈ ప్రక్రియ సందర్భంగా తొలిసారి వేసిన వేలిముద్రే సరిపోతుందని సబ్‌రిజిస్ట్రార్ సమక్షంలో మరోసారి వేలిముద్ర వేయాల్సిన అవసరం లేదంటూ చట్ట సవరణ జరిగింది.

ఆగస్టులోగా 12 మంది తహసీల్దార్ల పదవీ విరమణ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 30: ప్రభుత్వం పదవీ విరమణ కాలాన్ని రెండేళ్ల పాటు పెంచిన నేపథ్యంలో ఈ ఏడాది ఆగస్టు చివరి నాటికి ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 12మంది తహసీల్దార్లు పదవీ విరమణ చేయనున్నారు. 60 ఏళ్లకే పదవీ విరమణ చేయాల్సి ఉండగా, ఉద్యోగులకు ప్రభుత్వం గతంలో రెండు సంవత్సరాల పదవీ విరమణ కాలాన్ని పెంచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరుజిల్లాలో జనవరి 31 నాటికి అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె తహసీల్దార్ సీఆర్ మంజుల, ఫిబ్రవరి 29 నాటికి విజయపురం తహసీల్దార్ పి.వెంకటేశ్వర్లు, పలమనేరు ఆర్డీవో కార్యాలయం ఏవో ఎం.ప్రసాద్ బాబు, బి.కొత్తకోట తహసీల్దార్ ఎస్.రఫీఅహ్మద్ పదవీ విరమణ చేస్తారు. ఏప్రిల్ 30నాటికి కురబలకోట తహసీల్దార్ డీసీ కృష్ణమోహన్.. మే 31న ఐరాల తహసీల్దార్ పి. సుశీల, పలమనేరు తహసీల్దార్ ఇ.జి.కుప్పస్వామి, తవణంపల్లె తహసీల్దార్ కె. గురుశేఖర్ రెడ్డి.. జూన్ 30న పూతలపట్టు తహసీల్దార్ వై.విజయభాస్కర్, కలెక్టరేట్‌లోని భూసేకరణ విభాగ సూపరింటెండెంట్ పి.వెంకటేశ్వరన్.. ఆగస్టు 31న కుప్పం ఆర్డీవో కార్యాలయ ఏవో ఎస్ఎస్ కృష్ణకుమార్ పదవీ విరమణ చేయనున్నారు.

జేఈఈ మెయిన్స్‌కు 255 మంది

చిత్తూరు (సెంట్రల్), జనవరి 30: చిత్తూరులోని సీటమ్స్‌లో మంగళవారం జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షలకు 256 మంది విద్యార్థులకుగాను 255 మంది హాజరు కాగా, ఒకరు గైర్హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు. ఉదయం పరీక్షకు 128 మందికి గాను 127మంది .. మధ్యాహ్నం 128 మందికి అందరూ హాజరయ్యారన్నారు.

టీడీపీలో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న అమరనాథరెడ్డి

పలమనేరు, జనవరి30 : గంగవరం మండలం జీడిమాకులపల్లి గ్రామానికి చెందిన వాస్తు రాజారెడ్డి, శ్రీనాథరెడ్డి, వారి అనుచరులు టీడీపీలో చేరారు. మంగళ వారం పలమనేరులోని టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ రానున్న ఎన్నికల్లో అమరనాథరెడ్డి గెలుపుకోసం శాయశక్తులా కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు రామచంద్రనాయుడు, టీడీపీ గంగవరం మండల అధ్యక్షులు సోమశేఖర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా కార్యవర్గంలో పలమనేరుకు పలు పదవులు



జిల్లా కార్యవర్గంలో స్థానం పొందిన పలమనేరు ఉపాధ్యాయులు

పలమనేరు, జనవరి30 : ఎస్టీయూ జిల్లా కౌన్సిల్లో పలమనేరు మండలానికి సముచిత స్థానం కల్పించారు. చిత్తూరులో జరిగిన 77వ జిల్లా వార్షిక సమావేశంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షురాలిగా పలమనేరు ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు సుమతి, అదనపు ప్రధానకార్యదర్శిగా చెంగల్ రాయన్, రాష్ట్ర కౌన్సిలర్‌గా సుబ్రమణ్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగరాజు, కల్చరల్ కమిటీ సభ్యులుగా మల్లికార్జున్, మైనారిటీ కమిటీ మెంబర్‌గా మగ్బుల్‌బాషాలను ఎన్నుకొన్నారు. జిల్లా, రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించినందుకు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్‌కు, జిల్లా నాయకత్వానికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

టీడీపీలోకి వైసీపీ నేతలు



కుప్పం, జనవరి 30: కుప్పంలో అధికార వైసీపీలోంచి టీడీపీలోకి వలసలు ఎక్కువయ్యాయి. కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ కనమపచ్చార్లపల్లె వైసీపీ నాయకులు కుట్టియప్పన్, అన్బులు మంగళవారం టీడీపీలో చేరారు. కుప్పం లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, చెక్కునత్తం మణి, డాక్టర్ వెంకటేశ్, తిమ్మప్ప, మునిరత్నం, బీరప్ప, రమేశ్ పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గాజుల ఖాదర్‌బాషా

కుప్పం, జనవరి 30: చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో సుప్రీం ఇచ్చిన తీర్పు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి గట్టి చెంపదెబ్బ అని టీడీపీ కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు బెయిల్ రద్దు కోరుతూ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీం తిరస్కరించిందని గుర్తు చేశారు. జగన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకున్నదన్నారు. ఒకప్పుడు వైనాట్ 175 అన్న వ్యక్తి ఇప్పుడు ఓడిపోతే దిగిపోతా అంటున్నాడని గుర్తుచేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాకులు సర్దార్ బాషా, అన్సర్ బాష, మురళి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



పుంగనూరు రూరల్, జనవరి 30: పుంగనూరులో మంగళవారం అగ్నివన్నెకుల క్షత్రియ సంఘ నాయకులు క్యాలెండర్లను ఆవిష్కరించారు. స్థానిక కట్టకిందపాళ్యం, తూర్పుమొగసాల, కామాటంవారి వీధిలో అగ్నివన్నెకుల క్షత్రియ సంఘం క్యాలెండర్లు ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ రాయలసీమ అధ్యక్షుడు బలరాం, నాయకులు గోపి, గోవిందప్ప, వెంకటరమణ, శ్రీరాములు, బుజ్జిబాబు, మునివెంకటప్ప, కామాటం శ్రీరాములు,రమ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ మధూదన్‌రెడ్డి

గంగవరం, జనవరి 30: ప్రతిఒక్కరూ రహదారి నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే చాలావరకు ప్రమాదాలను అరికట్టవచ్చని పలమనేరు ఎంవీఐ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. రోడ్డుభద్రతా వారోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక మదర్‌థెరిస్సా కళాశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమన్నారు. సురక్షితమే ముఖ్యమన్నారు. జీవితం ఎంతో విలువైనదని ప్రాణంపోతే తిరిగి రాదన్నారు. అందుకే వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేందుకు జల్సాలకు దూరంగా ఉండాలని కష్టపడి చదవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, అకడమిక్ డైరక్టర్ రాజేంద్రరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సులభపద్ధతిలో బోధించండి

గంగవరం, జనవరి 30: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభపద్ధతిలో బోధించాలని ఎంఈఓ వేణుగోపాల్ రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.

పాఠశాలకు సౌండ్ బాక్స్ వితరణ



పలమనేరు, జనవరి30 : మండలంలోని కొలమాసన పల్లి సౌత్ ప్రాథమిక పాఠశాలకు రూ. 5వేలు విలువచేసే సౌండ్ బాక్సును కొలమాసనపల్లి సచి వాలయ ఇన్‌చిర్తి కోటీ అందజేశారు. ఈ సౌండ్ బాక్సును ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ నందీశ్వరన్ విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు అందజేశారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు.

చెరువులో మునిగి యువకుడి మృతి



రెహమాన్ మృతదేహం

కుప్పం రూరల్, జనవరి 30: కుప్పం మండలంలోని నూలు కుంట గ్రామ సమీపంలోని చెరువులో ఒక యువకుడు ప్రమాద వశాత్తు మునిగి చని పోయాడు. స్థానికుల కథనం మేరకు.. నూలు కుంట గ్రామానికి చెందిన రహ మాన్ మంగళవారం చేపలు పట్టడానికి చెరువులో దిగాడు. చెరువులోని గుంతలో బురదలో చిక్కుకుని బయటకు రాలేక మృతి చెందాడు. యువకుని మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం

సోమల, జనవరి 30: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం కోసం సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ నాగభూషణంరెడ్డి అన్నారు. మంగళవారం పొదలగుంటపల్లె సచివాలయం ఆవరణంలో జరిగిన వైద్యశిబిరంలో 372 మందికి డాక్టర్ జయసింహ, సోమశేఖర్‌రెడ్డి, భార్గవి వైద్యపరీక్షలు జరిపారు. ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచులు జయరాం, కేవీ.రమణ పలువురికి ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డులను అందజేశారు. కార్యదర్శి జయశంకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఊరొకటి.. బోర్డులో పేరొకటి



సోమల, జనవరి 30: ఈ మధ్య కాలంలోనే చెన్నయ్య గారిపల్లె, మఠం గొల్లపల్లెకు ఆర్‌అండ్‌బీ అధికారులు తారురోడ్డు నిర్మించారు. అయితే అధికారులు చెన్నయ్యగారి పల్లె బదులు సూచిక బోర్డులో ఓబులవారిపల్లె అని రాసి ఉంచారు. వాస్తవానికి ఓబులవారిపల్లె మండలంలోనే లేదు. లేని ఊరిపేరుతో బోర్డు ఏర్పాటు చేయడంతో పండుగలు, పబ్బాల సమయంలో చెన్నయ్యగారిపల్లెకు వచ్చే బంధువులు, ఇతర ప్రయాణికులు దారి తప్పుతున్నారు. అధికారులు స్పందించి బోర్డులో పేరు మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా సంకటహరచతుర్థి వ్రతం

రామకుప్పం, జనవరి 30: రామకుప్పంలోని వరసిద్ధి వినాయకాలయంలో సోమవారం రాత్రి సంకటహరచతుర్థి వ్రతం వైభవంగా జరిగింది. సాయంత్రం ఆలయ పురోహితులు నాగరాజశర్మ స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. విశేష అలంకరణ చేశారు. అనంతరం ఉభయదారులుగా నాగరాజు దంపతులు వ్యవహరించారు.

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

పలమనేరు, జనవరి30 : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను, పాఠశాలకు ఇచ్చిన ఇంటరాక్టివ్‌ప్లాట్ ప్యానల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ లీలారాణి, జిల్లా విద్యాశాఖ అధికారి ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం వారు పలమనేరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులకు సూచనలిచ్చారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ఐఎఫ్‌పీ ద్వారానే తమ సబ్జెక్టును బోధించాలని తెలియజేశారు.

టీడీపీతోనే బీసీలకు సముచిత స్థానం: చల్లా



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, జనవరి 30: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే బీసీలకు సముచిత స్థానం దక్కుతుందని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మంగళ వారం రొంపిచెర్ల జీకే ఫంక్షన్ హాలులో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని బీసీలందరూ పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా చల్లా రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో బీసీల కోసం చంద్ర బాబు అమలు చేసిన పథకాలతో వెనుక బడిన వారికి ఆదరణ చేకూరిందన్నారు. చేతి వృత్తుల వారికి పనిముట్లు పంపిణీ చేసిన ఘనత టీడీపీదే అన్నారు. వైసీపీ ప్రభుత్వం రిజర్వేషన్లు తగ్గించడంతో బీసీలకు పదవులు దూరమయ్యాయని, టీడీపీ అధికారంలోకి రాగానే తిరిగి బీసీలకు సముచిత న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఉయ్యాల రమణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషిచేయాలని కోరారు. ఐక్యంగా పనిచేస్తే విజయం ఖాయమన్నారు. ఈ సమావేశంలో రాజంపేట బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్ర యాదవ్, కురబకుల సంఘం పార్లమెంట్ అధ్యక్షుడు జనార్ధనరావు, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు సందరం, రజక సంఘం అధ్యక్షుడు జ్ఞానమూర్తి, నియోజకవర్గం ఐ-టీడీపీ అధ్యక్షుడు గూడూరు హరిబాబు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వి.జనార్ధన, చేనేత సంఘం నాయకులు పురం మల్లయ్య, వెంకట్రమణ, రఘు, మండల రజక నాయకుడు భాస్కర తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు రాలేదని అలిగిన ఎంపీపీ

అధికారులు, నాయకుల బుజ్జగింపుతో సమావేశానికి ● ఆలస్యంగా మండల సమావేశం

గంగవరం, జనవరి 30: చేసిన పనులకు బిల్లులు రాలేదని ఎంపీపీ వెంకటరమణ అలకబూనారు. అధికారులు, నాయకులు బతిమలాడడంతో ఆలస్యంగా మండల సమావేశానికి హాజరయ్యారు. గంగవరం మండల సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. అధికారులు, జడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అంతా హాజరయ్యారు. ఎంపీపీ మాత్రం కార్యాలయం బయటే ఉండిపోయారు. సమయంగా గడుస్తున్నా ఆయన రాకపోవడంతో అధికారులు, నాయకులు ఎంపీపీతో మాట్లాడారు. బిల్లులు వచ్చే వరకు లోకికి వచ్చేది లేదని తెగేసి చెప్పారు. అయితే బిల్లుల విషయం తర్వాత మాట్లాడుకుందామని ఇప్పుడు సమావేశానికి రాకుంటే మండలానికి చెడ్డపేరు వస్తుందని నచ్చజెప్పడంతో ఆయన అలకపాన్పు దిగారు. 3.30 గంటలకు లోనికి వచ్చారు. తర్వాత సమావేశం మొదలైంది. అధికారులు శాఖల వారీగా చేపడుతున్న పనులు, పెండింగ్ పనులు, పథకాల గురించి వివరిండంతోనే సమావేశంలో తూతూ మంత్రంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పార్వతమ్మ, తహసీల్దార్ అమర్నాథ్, ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి, ఏఈలు స్వామిదాస్, లక్ష్మీనారాయణ, ఏవో హేమలత తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఆమోదం



కమిషనర్‌ను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ చాముండేశ్వరి, పాలకవర్గ సభ్యులు

పలమనేరు, జనవరి30 : పలమనేరు మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు పాలక వర్గం ఆమోదం తెలిపింది. మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళ వారం సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్య క్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీ నిధుల తో మంజూరు అయిన రూ.52.10 లక్షలతో 13 పనులు చేపట్టేందుకు సభ్యులు ఆమోదించారు. గడ్డూరు, బొమ్మిదొడ్డి కాలనీల్లోని రోడ్లకు పేర్లు పెట్టాలని తీర్మానించారు. గత ఏడాది డిసెంబరుకు సంబంధించి సాధారణ మున్సిపల్ నిధులు రూ.34.20 లక్షలతో చేపట్టేం దుకు ఆమోదించిన పనుల టెండర్లను ఖరారు చేశారు. ఇంజినీరింగ్ విభాగం కోసం వెచ్చించేందుకు గత సమావేశంలో ఆమోదించిన మొత్తాన్ని వినియోగించాలని నిర్ణయించారు. ఈ సమా వేశంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

మిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రమణారెడ్డిని మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్, మున్సిపల్ కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు. శాలువ కప్పి, పూలమాలవేసి సన్మానించారు. మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

● మున్సిపల్ అధికారులకు, పాలకులకు ఎమ్మెల్సీ కంచర్ల లేఖ

కుప్పం, జనవరి 30: కుప్పంలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్‌కు, కమిషనర్ రాధికకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ లేఖ రాశారు. అలాగే సామాజిక కార్యకర్త నరేంద్ర అజాద్‌తో కలిసి ప్రజలు ఇదే అంశంతో లేఖ రాశారు. ఆ రెండు లేఖలను మంగళవారం కలెక్టర్‌కు సైతం పంపారు. కుప్పం పట్టణ పరిధిలోని దళవాయి కొత్తపల్లె నుంచి ఆర్‌కే నగర్ మీదుగా మోడల్ కాలనీ వరకు వెళ్లే ప్రధాన రహదారిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ లేఖల్లో పేర్కొన్నారు. వీధి దీపాలు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఉంచాలని చెప్పారు. రోడ్డు మీదికొచ్చిన అక్రమ కట్టడాలను తొలగించాలని కోరారు. శనివారం ఇదే రోడ్డులో ఒక యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదానికై మృతి చెందిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. అదేవిధంగా పట్టణంలో అధికంగా ప్రమాదాలు జరుగుతున్న ఎమ్మార్ రెడ్డి సర్కిల్, బైపాస్ రోడ్డు, ఫ్లైవోవర్, శెట్టిపల్లె సర్కిల్, ప్యాలెస్ రోడ్డు, లక్ష్మీ సర్కిల్, నేతాజీ రోడ్డు, రాజీవ్ కాలనీ సర్కిల్, బాబు నగర్ సర్కిల్, పైబాట రోడ్లలో కూడా వీధి దీపాలు ఏర్పాటు చేసి, సరైన డిజైన్‌తో స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని, ప్రమాద సూచిక బోర్డులు కూడా ఉంచాలని కోరారు.

కక్షసాధింపులు తగవు :ఎన్ఎంయూ



ధర్నా చేస్తున్న కార్మికులు

కుప్పం, జనవరి 30: విశాఖ డీపీటీవో నియంతృత్వ పోకడలకు, కక్షసాధింపు చర్యలకు నిరసనగా కుప్పం ఆర్టీసీ డిపో ఎదుట మంగళవారం ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో కార్మికులు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్షులు ఎస్.మునస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ప్రసాద్ కుమార్, జిల్లా నాయకుడు జంప నూర్ శీను, డిపో కార్యదర్శి ఇ.జయపాల్, డిపో సంయుక్త కార్య దర్శి జి.మునెప్ప తదితరులు మాట్లా డుతూ విశాఖ డీపీటీవో కక్షసాధింపు చర్యలు మానుకోవాలని, సంస్థకు నష్టం కలిగించే చర్యలు విడనాడాలని కోరారు. ఎన్ఎంయూ నాయకులను అన్యా యంగా పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడానికి కారణమైన డీపీ టీవోపై చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని యూనిట్లలో ఏఏఎస్ ఇంక్రిమెంట్లు సకాలంలో ఆర్టీసీ నిబంధనల మేరకు అమలు చేయాలని, కౌన్సెలింగ్ పద్ధతిలో డ్యూటీ చార్ట్ వేయాలని, విశాఖ జిల్లా కమిటీ ఇచ్చిన మెమొరాండంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అన్ని మెడికల్ సర్టిఫికెట్లకు వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ గ్యారేజ్ అధ్యక్షుడు వెంక టేశ్, నాయకులు ఎంసీ.నాయక్, ఎస్ఆర్.రాజా, టి.ఎస్.మణ్యం, ఎంఆర్.చంద్ర, ప్రసన్న, అమర్‌నాథ్, అరుణ్, ధనపాల్, జగ్గయ్య పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



సువర్ణ లక్ష్మి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఆంజినేయరెడ్డి తదితరులు



రమేష్ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న మునస్వామి తదితరులు

రామకుప్పం, జనవరి 30: రామకుప్పం మండలం కెంచనబల్ల పంచాయతీ పచ్చారుమాకులపల్లెకు చెందిన రమేష్ సోమవారం కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ సమీపంలో ఎద్దుల పండుగలో జరిగిన ఘర్షణలో ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయాడు. అదేవిధంగా రామకుప్పం పంచాయతీ కెంపసముద్రం, కెంచనబల్ల పంచాయతీ కోటచేనులకు చెందిన సువర్ణలక్ష్మి, గంగప్ప అనారోగ్యంతో మృతిచెందారు. టీడీపీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జీ మునిరత్నం, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ అంజినేయరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు విశ్వనాథ్‌లు మృతులకు నివాళులర్పించారు. మృతుల కుటుంబసభ్యులకు రూ.10వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా గూళిపల్లెలో మృతి చెందిన ఉస్సిగానిపల్లె పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తల్లి లక్ష్మమ్మ మృతదేహాన్ని నేతలు సందర్శించి నివాళులర్పించారు.

వైసీపీ ఆర్థికసాయం

కోటచేనులో గంగప్ప, కెంపసముద్రంలో సువర్ణ లక్ష్మీ, పచ్చారుమాకులపల్లెలో రమేష్‌ల మృతదేహాలకు ఎమ్మెల్సీ భరత్, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, వైసీపీ మండల కన్వీనర్ విజలాపురంబాబు, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి నివాళులర్పించారు. మృతుల కుటుంబసభ్యులకు పార్టీ తరపున రూ.10వేలు చొప్పున ఆర్థికసాయం అందించారు.

మహాత్ముడికి ఘననివాళి



కుప్పంలో గాంధీజీకి నివాళులు



పలమనేరులో గాంధీజీకి ఆర్యవైశ్యుల నివాళులు

కుప్పం, జనవరి 30: కుప్పంలో మంగళవారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, వైస్ చైర్మన్ మునస్వామితోపాటు పార్టీలతో ప్రమేయం లేకుండా పలువురు నాయకులు నేతాజీ రోడ్డులోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు.

పలమనేరు: పలమనేరు పొట్టిశ్రీరాములు బజారు వీధిలోని వాసవి సర్కిల్ వద్ద గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాచమడుగు సుభాష్‌చంద్రబోస్, వాసవి కన్యకాపరమేశ్వరి ఎడ్యుకేషనల్ ట్రస్టు అధ్యక్షులు శేగు నరసిం హులుశెట్టి, శ్రీపురం సీతారామయ్య, సత్యప్రకాష్ పాల్గొన్నారు.

రొంపిచెర్ల: బోడిపాటివారిపల్లెలోని గాంధీ విగ్రహానికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ జిల్ల కన్వీనర్ డాక్టరు రఘునాద్, ఆర్టీఐ కో-కన్వీనర్ మల్లేపల్లి వెంకటేష్, మండలం లోని నాయకులు నారాయణస్వామి, రాజన్న పాల్గొన్నారు.

చౌడేపల్లె: స్థానిక వాసవి వనితా క్లబ్ సభ్యులు గాంధీవీధిలో ఉన్న మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నాగలక్ష్మి, కృష్ణమూర్తి, రామ్‌కుమార్, ఉషారాణి, శ్రీనాథ్, లోకేష్, లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరానికి విశేష స్పందన

చౌడేపల్లె, జనవరి30: మండలంలోని నూనెముద్దల వారిపల్లెలో వాటర్‌షెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభిం చింది. 120 పశువులకు చికిత్స అందించి నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. డాక్టర్ పవన్‌కుమార్, వైద్య సిబ్బంది, వాటర్ షెడ్ చైర్మన్ సుబ్బరాజు పాల్గొన్నారు.

ఆందోళన ఆగదు : న్యాయవాదులు



రిలేదీక్షలు చేస్తున్న న్యాయవాదులు

పుంగనూరు, జనవరి30: భూ రక్షణ చట్టాన్ని రద్దు చేసేవరకు ఆందోళన ఆగదని పుంగనూరు సీనియర్ న్యాయవాది బి.వెంకటమునియాదవ్ హెచ్చరించారు. మంగళవారం కోర్టు ముందు బైపాస్‌రోడ్డులో న్యాయవాదులు రిలే నిరాహారదీక్ష చేట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టం ప్రజల ఆస్తులు కాజేయడానికి రాజకీయనాయకులు, కార్పొరేట్లు పన్నిన కుట్ర అని విమర్శించారు. అందుకే ప్రజా ఆస్తులను కాపాడడానికి న్యాయవాదులు పోరా టం చేస్తున్నట్లు తెలిపారు. న్యాయవాదులు ఆనంద్ కుమార్, విజయభాస్కర్, షరత్‌కుమార్, అలెగ్జాండర్, సోమశేఖర్, సందీప్, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు శివశంకర్‌నాయుడు, సురేశ్ బాబు, గిరిధర్, హేమంత్, శ్రీనివాసులు, వెంకటరమణ, వినోద్, కృష్ణారెడ్డి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మోహన్



పుంగనూరు రూరల్, జనవరి30: ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బి.మోహన్ రెండవసారి ఏకగ్రీవంగా ఎంపికైనట్లు జిల్లా అధ్యక్షుడు గంటా మోహన్ తెలిపారు. మంగళవారం చిత్తూరులో జరిగిన కార్యవర్గ సమావేశంలో పుంగనూరుకు రాష్ట్ర, జిల్లా స్థానాల్లో అవకాశం కల్పించినట్లు చెప్పారు. రాష్ట్ర కౌన్సిలర్‌గా నరేంద్ర, డివిజన్ కన్వీనర్‌గా వెంకటరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్రీనివాసులు, జిల్లా మైనార్టీ కమిటీ సభ్యుడుగా ఖాదర్‌బాషా, జిల్లా కమిటీ సభ్యురాలుగా రేవతిలను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘనాయకులు బుడ్డన్న, హరికిషోర్‌రెడ్డి, మంజునాథ్, శ్రీనాథ్, సుధాకర్, వెంకటప్ప, దీపారాణి, పద్మజ, పార్వతమ్మ, మాధవి, సరిత పాల్గొన్నారు.

సాగుభూములిచ్చేందుకు చర్యలు

పుంగనూరు రూరల్, జనవరి30: గిరిజనుల అనుభవంలోని భూములను వారికే ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు చిత్తూరు డీఎఫ్‌వో చైతన్యకుమార్ తెలిపారు. మంగళవారం పాళ్యంపల్లె పంచాయతీ షికారిపాళ్యంలో కాపురం ఉన్న ఎస్టీలు తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీఎఫ్‌వో, అటవీశాఖ సిబ్బంది, రెవెన్యూ అధికారులు కలసి ఆ భూములను పరిశీలించారు. భూముల వివరాలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, జనవరి30: పుంగనూరు- మదనపల్లె మార్గంలోని దండుపాళ్యం క్రాస్ వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పుంగనూరు మండలం కృష్ణమరెడ్డి పల్లెకు చెందిన నారాయణప్ప(70), శంకరప్ప ద్విచక్రవాహనంలో మల్లుపల్లెకు వెళుతుండగా పలమనేరు వైపు నుంచి వచ్చిన ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. 108 వాహనంలో పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నారాయణ తలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

పుంగనూరు రూరల్, జనవరి30: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పుంగనూరు బీజేపీ కన్వీనర్ మదన్‌మోహన్ తెలిపారు. పల్లెకుపోదాం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పుంగనూరు మండలం నెక్కుంది పంచాయతీలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నానబాల కుమార్, కృష్ణమూర్తి, మఠం బాబు, మల్లిఖారాణి, పురుషోత్తంరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణపై అవగాహన ఉండాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మనోహర్

పుంగనూరు రూరల్, జనవరి30: జంతు సంరక్షణపై విద్యార్థులకు అవగాహన ఉండాలని పుంగనూరు పశువర్ధకశాఖ ఏడీ డాక్టర్ మనోహర్ తెలిపారు. మంగళవారం స్థానిక లినార్డు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు జంతుసంక్షేమంపై వ్యాసరచనలు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ సేవాదళ్ అధ్యక్షుడిగా సిద్ధిక్

పుంగనూరు రూరల్, జనవరి30: వైసీపీ చిత్తూరు జిల్లా సేవాదళ్ అధ్యక్షుడుగా పీఎస్.సిద్ధిక్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ మంగళవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

టీటీడీ ఈవో ధర్మారెడ్డికి బదిలీ ఉండదా..?: టీడీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, జనవరి 30: టీటీడీ ఈవో ధర్మారెడ్డికి బదిలీ ఉండదా అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ప్రశ్నించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయితీ సెక్రటరీ నుంచి ప్రిన్సిపల్ సెక్రటరీ వరకు బదిలీలు జరుగుతుంటాయని అన్నారు. అయితే టీటీడీ ఇన్‌చార్జ్ ఈవో ధర్మారెడ్డికి మాత్రం బదిలీయే ఉండదా అని అన్నారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా టీటీడీలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, అడిషనల్ ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలలో కొనసాగుతున్న ధర్మారెడ్డిని ఎందుకు బదిలీ చేయడంలేదని ప్రశ్నించారు. ఒకే రాష్ట్రంలో ఒకేచోట నాలుగున్నరేళ్లుగా పనిచేస్తున్న ధర్మారెడ్డిపై వైసీపీ ప్రభుత్వానికి ఎందుకంత ప్రేమో చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణం ధర్మారెడ్డిని బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ నేతలు మోహన్‌రాజ్, ధరణి ప్రకాష్, యోన, కరన్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపుతున్న అన్నా క్యాంటీన్



భోజనం తింటున్న చిన్నారులు

పూతలపట్టు, జనవరి 30: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఈనెల 18వ తేదీన ఎన్ఆర్ఐ టీడీపీ నేత ఊట్ల శ్యామసుందరరావు తల్లిదండ్రులు నాగరాజులు నాయుడు, బావ హేమాద్రి నాయుడు అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ క్యాంటీన్ ద్వారా నిత్యం వందలాదిమంది పేదలు, ప్రయాణికులు కడుపునిండా భోజనంచేసి వెళ్తున్నారు. పూతలపట్టులో అన్నా క్యాంటీన్ ద్వారా ఉచితంగా భోజనం పంపిణీ చేస్తున్న విషయం పలువురికి తెలియడంతో రోజురోజుకూ పేదలు క్యాంటీన్ వద్దకు చేరుకుని తృప్తిగా భోజనంచేసి వెళ్తున్నారు. ఇదిలా వుండగా పాఠశాల విద్యార్థులు కూడా అన్నా క్యాంటీన్ వద్దకు వచ్చి తృప్తిగా తిని వెళ్లడంపై టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం నియోజకవర్గ పరిశీలకులు బొమ్మన శ్రీధర్, దాత ఊట్ల నాగరాజులు నాయుడు, హేమాద్రి నాయుడు, మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, నాయకులు హరి, ఏకాంబరం, రజనీ, భాస్కర్, బాలాజీ, హరి, వీరభద్రయ్య, సుబ్బరాజులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులను డ్రైవర్లు అప్రమత్తంగా నడపాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ నిరంజన్ రెడ్డి

చిత్తూరు సిటీ, జనవరి 30: స్కూల్ బస్సులను డ్రైవర్లు అప్రమత్తంగా నడపాలని డీటీసీ నిరంజన్ రెడ్డి సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో స్కూల్ బస్ డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ బస్సును మెయింటెనెన్స్ చేయాలన్నారు. ఇంజన్, బ్రేక్, టైర్లు, డోర్స్ ఇతర ప్రాథమిక చెకప్‌లు చేసుకోవాలని సూచించారు. కచ్చితంగా డ్రైవిగ్ లైసెన్స్ కలిగివుండాలని, బస్సులో క్లీనర్ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. మద్యం సేవించి వాహనం నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడపకూడదని చెప్పారు. ఓవర్ టేక్ చేయడం, అధిక వేగంతో వాహనం నడపడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాన్ని నడపడం వంటివి చేయకూడదని సూచించారు. విద్యార్థులను క్షేమంగా గమ్యస్థానానికి చేర్చడం డ్రైవర్ల బాధ్యత అని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు వాసుదేవ రెడ్డి, రాజేశ్వరరావు, మురళి, దీపిక, ఏఎంవీఐలు ప్రసాద్‌వర్మ, భాగ్యశ్రీ, ఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో అధిక ఆదాయం

పెనుమూరు, జనవరి 30: పుట్టగొడుగుల పెంపకంతో అధిక ఆదాయం పొందటంతో పాటు ప్రజలకు సమతుల పోషకాలు అందుతాయని తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు పి.అరుణశ్రీ, ఎం.గురివిరెడ్డి అన్నారు. మంగళవారం వారు మండలంలోని సామిరెడ్డిపల్లిలో ప్రజలకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. రైతులకు ఆర్థిక సాయంగా పుట్టగొడుగుల పెంపకం అనువైనదని ఏడీఏ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జమున, మండల వ్యవసాయ అధికారి కళ్యాణ్‌బాబు, గ్రామ వ్యవసాయ అధికారి క్రాంతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు కుంభాభిషేకం

కార్వేటినగరం, జనవరి 30: కార్వేటినగరం కొమరగిరిపై వెలసిన సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ సంప్రోక్షణ కుంభాభిషేకం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. బుధవారం ఆలయంలో ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల మధ్య సుబ్రమణ్యేశ్వర స్వామికి అభిషేకం, ఆరాధన, కలశ స్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం టీటీడీ సహకారంతో హరికథ కాలక్షేప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

2న కోదండ రామాలయంలో కల్యాణోత్సవం

చిత్తూరు కల్చరల్, జనవరి 30: తై నెల (తమిళ సాంప్రదాయంలో భాద్రపద మాసం) మూడవ శనివారం ఫిబ్రవరి 2వ తేదీన స్థానిక కోదండ రామాలయంలో స్వామి అమ్మవార్లకు అత్యంత వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సుబ్రమణ్యం నాయుడు, అర్చకులు వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులకు తీర్థ ప్రసాదాలు, అక్షింతలు పంపిణీ చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

సారా స్వాధీనం
● ముగ్గురు వ్యక్తుల పరార్



స్వాధీనం చేసుకున్న సారా ప్యాకెట్లతో పోలీసులు

గుడిపాల, జనవరి 30: మండలంలో సారా విక్రయిస్తున్న ప్రాంతాల్లో దాడులు నిర్వహించగా, ముగ్గురు వ్యక్తులు పరారవ్వడంతో అక్కడున్న సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాసనపల్లి పరిసర ప్రాంతాల్లో సారా విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో అక్కడ దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా 200ప్యాకెట్ల సారా, 30లీటర్ల ట్యూబ్‌ను స్వాధీనం చేసుకోగా, అక్కడున్న ముగ్గురు వ్యక్తులు పరారయ్యారని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆగివున్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

బంగారుపాళ్యం, జనవరి 30: ఆగివున్న కంటైనర్ లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో 15మంది గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని కాటప్పగారిపల్లె సమీపంలో తిరుపతి నుంచి అలిపిరి డిపో బస్సు బెంగళూరుకు వెళుతుండగా ఆగివున్న కంటైనర్ లారీని అదుపు తప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో 15 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి 10మందిని తరలించగా, మరోఐదు మంది బంగారుపాళ్యం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

విద్యుత్ షాక్‌తో
టీడీపీ బీసీసెల్ నేత భార్య మృతి

యాదమరి, జనవరి 30: ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ బీసీసెల్ యువత అధ్యక్షుడి భార్య మృతి చెందారు. దాసరాపల్లె పంచాయతీ ఆరిమాకులపల్లెకు చెందిన ధరణీప్రకాష్ పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ బీసీసెల్ యువత అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన భార్య మాధవి మంగళవారం తన పొలంలోని బోరు మోటరు వద్ద పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి మృతి చెందారు. పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్, మండల పార్టీ అధ్యక్షులు మురార్జీ, ప్రధాన కార్యదర్శి రవి, నేతలు వల్లేరు అమరనాథ నాయుడు, చిట్టి నాయుడు, గుణ, మోహన్, చిత్ర, నాగరాజు తదితరులు ఆమె మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలిపారు.

సుప్రీం కోర్టు తీర్పు జగన్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు: టీడీపీ

చిత్తూరు సిటీ, జనవరి 30: సుప్రీం కోర్టు తీర్పు సీఎం జగన్ రెడ్డికి చెంపపెట్టని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో జగన్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసిందని అన్నారు. అధికార గర్వంతో జగన్ అండ్ కో పెట్టిన కేసులు తప్పుడువి అని సుప్రీం కోర్టు తీర్పుతో రుజువైందని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికైనా సీఎం జగన్, వైసీపీ నేతలు సిగ్గుపడాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో నేతలు మోహన్‌రాజ్, ధరణి తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో టీడీపీని ఆదరించండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న గంధమనేని

శ్రీరంగరాజపురం, జనవరి 30: రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ప్రతి ఒక్కరూ ఆదరించాలని మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు కోరారు. మంగళవారం మూలూరు ఎస్టీ కాలనీలో బాబు ష్యూరిటీ.. భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మళ్లీ బాబును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ సోమేశ్వర్‌రెడ్డి, శివయ్య, నీరంజన్‌రెడ్డి, దొడ్డ హేమాద్రి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ భవనం ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి ఆర్కే రోజా

విజయపురం, జనవరి 30: మండలంలోని మాదవరం పంచాయతీ పన్నూరుసబ్‌స్టేషన్ సమీపంలో రూ.5.7 కోట్లతో నిర్మించిన ఐటీఐ భవన నిర్మాణాన్ని మంగళవారం మంత్రి ఆర్కే రోజా ప్రారంభించారు. ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు, సుమశ్రీ కన్‌స్ట్రక్షన్ ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్ గణేశ్, జడ్పీటీసీ రేవతి, వైఎస్‌ఎంపీపీ బాలాజీ పాల్గొన్నారు.

ఆసరా చెక్కు పంపిణీ

పాలసముద్రం, జనవరి 30: మండల కేంద్రమైన పాలసముద్రం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో డ్వాక్రా సంఘాలకు డిప్యూటీ సీఎం నారాయణ స్వామి నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కును మంగళవారం పంపిణీ చేశారు. 432 గ్రూపులకు గాను రూ.3.51 కోట్ల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అన్బు, మండల వైసీపీ కన్వీనర్ తులసీయాదవ్, ఏవో విద్యావతి, ఏపీఎం ఫరీద్‌మస్తాన్ పాల్గొన్నారు. కాగా తమ సమస్యలను పరిష్కరించాలంటూ నియోజకవర్గంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు డిప్యూటీ సీఎంకి వినతిపత్రం సమర్పించారు.

వైభవంగా సంకటహరచతుర్థి వ్రతం

రామకుప్పం, జనవరి 30: రామకుప్పంలోని వరసిద్ధి వినాయకాలయంలో సోమవారం రాత్రి సంకటహరచతుర్థి వ్రతం వైభవంగా జరిగింది. సాయంత్రం ఆలయ పురోహితులు నాగరాజశర్మ స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. విశేష అలంకరణ చేశారు. అనంతరం ఉభయదారులుగా నాగరాజు దంపతులు వ్యవహరించారు.

వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి

● మాజీ ఎమ్మెల్సీ దొరబాబు



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 30: వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. మంగళవారం నగరంలోని 22వ డివిజన్ తేనెబండ, 23వ డివిజన్ జానకారపల్లెలో టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. సీఎం జగన్ ఎప్పుడో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని అన్నారు. అధికారులను అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు అనేక అక్రమాలకు పాల్పడుతూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని అత్యంత భారీ మెజారిటీతో గెలిపించి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. అనంతరం స్థానికులకు టీడీపీ మినీ మ్యానిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో నేతలు సురేంద్రకుమార్, చంద్రప్రకాష్, కటారి హేమలత, గురజాల జగన్‌మోహన్, కాజూరు బాలాజి, కంద, రాజశేఖర్, జాఫర్, దేవరాజులు, హరి, కోదండ, అర్జున్, బాబు, మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండిని తాకట్టు పెట్టుకుని ఉడాయించిన
పాన్‌బ్రోకర్ షాపు యజమాని అరెస్టు

యాదమరి, జనవరి 30: ప్రజలు, రైతుల వద్ద బంగారం, వెండిని తాకట్టు పెట్టుకుని ఉడాయించిన ఓ పాన్‌బ్రోకర్ షాపు యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... మండల కేంద్రమైన యాదమరిలోని గంగమ్మగుడి సమీపంలో రాజస్థాన్‌కు చెందిన మధు అనే వ్యక్తి శ్రీకృష్ణ జ్యువెలరీస్ అండ్ పాన్‌బ్రోకర్ షాపును నిర్వహిస్తున్నాడు. గత కొన్నేళ్లుగా మండల ప్రజలకు నమ్మకంగా ఉండటంతో పలువురు రైతులు, ప్రజలు బంగారం, వెండిని అతడి వద్ద కుదువ పెట్టారు. కుదువ పెట్టుకున్న బంగారంతో నెల రోజులకు ముందు అతడు ఎవరికి తెలియకుండా పరారయ్యాడు. సొంతూరికి వెళ్లి వస్తాడని అనుకున్న ప్రజలు నెల రోజులుగా కుదువ వ్యాపారి కోసం వేచి చూశారు. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి షాపులో మిగిలివున్న వెండిని తీసుకెళ్లేందుకు షాపును తెరుస్తుండగా, గస్తీలో ఉన్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం మండలంలో ప్రచారం కావడంతో మంగళవారం ఒక్క రోజే 150 మంది వరకు ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి మూడు కిలోల వరకు బంగారాన్ని తాకట్టు పెట్టుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. మండలంలో ఇంకెవరైనా బంగారం, వెండిని తాకట్టు పెట్టి ఉంటే ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైకిల్‌కు ఓటేయండి.. టీడీపీని గెలిపించండి

- గాలి భానుప్రకాష్



16వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న భానుప్రకాష్

నగరి, జనవరి 30: సైకిల్‌కు ఓటేసి తెలుగుదేశం పార్టీ తరుపున ఎమ్మెల్యేగా నగరిలో నన్ను, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబును గెలిపిస్తే సమస్యల పరిష్కారంలో ఎల్లవేళలా ముందుంటామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరి పట్టణంలోని 16వ, 23వ వార్డుల్లో భానుప్రకాష్ పర్యటించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటి కెళ్లి పంపిణీ చేస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. భానుప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టిన దరిద్రం పోవాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే పెంచిన విద్యుత్, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసన్ జిల్లా కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర మైనారిటీ అధికారప్రతినిధి ఖాదర్‌భాయ్, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, నేతలు జ్యోతి నాయుడు, మీరా, గుణశేఖర్, కృష్ణారెడ్డి, సురేష్ నాయుడు, శ్రీధర్, ఆర్ముగం, సలీమ్, గోపాల్, శివకుమార్‌రెడ్డి, ఆనందరెడ్డి, నారాయణస్వామి నాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డీఈవో ఆకస్మిక తనిఖీ



విద్యార్థిని చదువు సామర్థ్యాన్ని తెలుసుకుంటున్న డీఈవో

చిత్తూరు (సెంట్రల్), జనవరి 30: నగరంలోని పలు పాఠశాలలను డీఈవో విజయేంద్రరావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానిక తేనెబండ ఎంపీయూపీ స్కూల్‌తో పాటు సమీపంలోని పలు పాఠశాలను సందర్శించి అక్కడి విద్యార్థుల చదువు సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో టీచర్లతో సమావేశం నిర్వహించి బోధన సామర్థ్యాలపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రతి సబ్జెక్టులోనూ రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యా సంవత్సరం విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్నం భోజనం, పారిశుద్యం, నీటి సరఫరా, తదితర అంశాలపై సూచనలు చేసి, పలువురు టీచర్ల లోపాలను గుర్తించి హెచ్చరించి, తగు ఆదేశాలు జారీ చేశారు.

వాహనాల వేలం ద్వారా రూ.44 వేలు ఆదాయం

గుడిపాల, జనవరి 30: మండలంలోని గుడిపాల పోలీసు స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడ్డ ద్విచక్ర వాహనాలను వేలం నిర్వహించినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ నాయుడు, ఏఈఎస్ ఎస్. రవి తెలిపారు. స్కూటీ, టీవీఎస్ ఎక్సెల్ వాహనాలకు వేలం నిర్వహించగా, రూ.44 వేలకు పాటదారులు దక్కించుకున్నారు. దీంతో ప్రభుత్వానికి రూ.44 వేలు ఆదాయం సమకూరింది.

2న అర్చక సమాఖ్య సమావేశం

చిత్తూరు కల్చరల్, జనవరి 30: అర్చక, పురోహితుల సమావేశం ఫిబ్రవరి 2న స్థానిక కోదండ రామాలయంలో నిర్వహిస్తున్నట్లు అర్చక సమాఖ్య నాయకులు బి. వేణుగోపాల్, సుధాకర్ గురుకుల్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కుష్టు వ్యాధి నివారణ అధికారి వెంకటప్రసాద్

చిత్తూరు రూరల్, జనవరి 30: కుష్టు వ్యాధిపై ప్రజలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా కుష్టు వ్యాధి నివారణ అధికారి వెంకటప్రసాద్ సూచించారు. మంగళవారం కుష్టు వ్యతిరేక దినం సందర్భంగా నగరంలో వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి 'మైకో బ్యాక్టీరియం లేప్రే' అనే బ్యాక్టీరియా ద్వారా వస్తుందన్నారు. జబ్బు ఉన్న వ్యక్తి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు తుంపర్లు గాలిలో కలిసి వాటిని పీల్చిన వ్యక్తికి వస్తుందన్నారు. అయితే వ్యాధి లక్షణాలు కనబడటానికి ఆరు నెలల నుంచి ఆరు సంవత్సరాల వరకు పడుతుందని ఆయన పేర్కొన్నారు. మొదటగా స్పర్శ లేని మచ్చలు, శరీరంలో రాగి రంగులో మచ్చలు కానీ, తెల్లని పొడలు, సూదితో తాకినప్పుడు, అగ్గి తాకినప్పుడు స్పర్శ తెలియకపోవడం, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కుష్టు వ్యాధికి ఆరు నెలల నుంచి సంవత్సరంలోపు మందులు వాడితే నయమైపోతుందని చెప్పారు. డాక్టర్లు సాయి షర్మిల, శిరీష, ప్రతాప్, డీపీఎంవో రవికుమార్, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల నెత్తిన ఛార్జీల భారం: టీడీపీ

కార్వేటినగరం, జనవరి 30: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ఛార్జీల పెంపు సామాన్యుడి పాలిట శాపంగా మారిందని టీడీపీ రాష్ట్ర ముస్లీం మైనారిటీ కోఆర్డినేటర్ పర్వేజ్ విమర్శించారు. మంగళవారం కార్వేటినగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు యూనిట్ల విద్యుత్ వినియోగదారులకు రూ.432 బిల్లు రావడం ఆశ్చర్యకరమని అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వాదన సరికాదన్నారు. గత టీడీపీ ప్రభుత్వం సాంప్రదాయతేర ఇంధన వనరులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే ప్రస్తుత ప్రభుత్వం దాని గురించి పట్టించుకోవడం లేదని చెప్పారు. కరెంటు ఛార్జీలను తగ్గించే విద్యుత్ ఉపకరణాలను రాష్ట్ర ప్రభుత్వమే సబ్సిడీ ధరలతో వినియోగదారులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కరెంటు కోతలకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ నష్టనివారణ చర్యలను తీసుకోకుండా ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపడం చాలా అన్యాయమని ఆయన విమర్శించారు.

స్పాట్‌లో పీజీ టీచర్ల సేవలను వినియోగించుకోండి



డీవీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎన్‌టీఏ సంఘం నాయకులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 30: హైస్కూల్ ప్లస్‌లో పనిచేసే పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ల (పీజీటీ) సేవలు సద్వినియోగం చేసుకోవాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు మంగళవారం డీవీఈవో సయ్యద్ మౌల, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దయానందరాజులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్‌లో ఎంతో అనుభవం కలిగిన పీజీటీలు ఉన్నారని, రానున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు, మూల్యాంకనంలో వీరి సేవలు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. డీవీఈవోకు వినతి పత్రం సమర్పించిన వారిలో ఎన్‌టీఏ నాయకులు దామోదర్‌రెడ్డి, సురేష్, లక్ష్మి తదితరులు ఉన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

బంగారుపాళ్యం, జనవరి 30: మండలంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద అన్నా క్యాంటీన్‌లో మంగళవారం బొమ్మాయిపల్లికి చెందిన ఏపీ గీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నీరజాక్షులు గౌడ్, ప్రేమల వివాహ వార్షికోత్సవం సందర్భంగా పేదలకు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోకనాథం నాయుడు, వంశీ, ఆరీఫ్ బాషా, రాధిక, పట్టాభి, గంగాధరం, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ చిత్తూరు అర్బన్ కన్వీనర్‌గా మురళి



మురళి, విజయలక్ష్మి

చిత్తూరు (సెంట్రల్), జనవరి 30: ఎస్టీయూ చిత్తూరు అర్బన్ డివిజన్ కన్వీనర్‌గా బి. మురళి, అదనపు కన్వీనర్‌గా ఆర్. విజయలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన జిల్లా సమావేశంలో అర్బన్ కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వనిత, జిల్లా కార్యదర్శిగా మంజుల, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డేవిడ్‌లను ఎన్నుకున్నారు. తమపై నమ్మకముంచి ఎన్నుకున్న జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ హయాంలో దోచుకోవడమే: టీడీపీ



మాట్లాడుతున్న బోడపాటి లోకనాథం నాయుడు తదితరులు

శ్రీరంగరాజపురం, జనవరి 30: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దోచుకోవడం, దాచుకోవడం తప్ప ఎలాంటి అభివృద్ధి జరగలేదని జిల్లా టీడీపీ ప్రత్యేక ఆహ్వానితులు బోడపాటి లోకనాథం నాయుడు విమర్శించారు. మంగళవారం రాఘవరాజపురంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడే రోజులు చాలా దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో అభివృద్ధిని గాలికొదిలేసి అరాచకాలు, అక్రమ కేసులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబు నాయుడు, నాయకులు రాజశేఖర్ నాయుడు, నాగేశ్వరరాజు, సిద్దయ్యశెట్టి, భాస్కర్ నాయుడు, డిల్లీ, జ్యోతిప్రకాష్, చిన్నబ్బరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మానవ విలువలపై
పరీక్షలు నిర్వహించాలి: డీవీఈవో

చిత్తూరు (సెంట్రల్), జనవరి 30: జిల్లాలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు నైతిక, మానవ విలువలు అంశాలపై పరీక్షలు నిర్వహించాలని డీవీఈవో సయ్యద్ మౌల పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీసీఆర్ కళాశాలలోని డీవీఈవో సమావేశ మందిరంలో ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ, మోడల్ స్కూల్, వెల్ఫేర్ స్కూల్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఫిబ్రవరి 2, 3 తేదీల్లో నిర్వహించే పరీక్షలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీఈవో మాట్లాడుతూ ఫిబ్రవరి 2న నైతిక, మానవ విలువలు, 3న పర్యావరణ విద్య అంశాలపై పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రశ్నాపత్రాలు ఇంటర్మీడియట్ బోర్డు జ్ఞాన భూమి లాగిన్ తీసుకోవాలన్నారు. పరీక్షల అనంతరం జవాబు పత్రాలను సమీప కళాశాల అధ్యాపకులచే మూల్యాంకనం చేయించి, అదే రోజున మార్కులను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. సమాధాన పత్రాలను డీవీఈవో కార్యాలయానికి పంపాలని చెప్పారు. సమావేశంలో పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు అబ్దుల్ మజీద్, రమేష్, ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు బాలసుబ్రమణ్యం, దయానందరాజు, మురళీకృష్ణ జయప్రకాష్ హేమలత, పలు కళాశాలల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక నిర్మాణానికి రూ.30 లక్షల విరాళం

చిత్తూరు రూరల్, జనవరి 30: నగరంలోని శ్మశానవాటికలో లయన్స్‌క్లబ్, ఆర్య వైశ్య సంఘం కలిపి నూతనంగా నిర్మిస్తున్న కైలాస ధామం బర్నింగ్ మిషన్ ఏర్పాటుకు బీవీరెడ్డి పాఠశాల అధినేత్రి సౌమిని రెడ్డి రూ.30 లక్షలు ప్రకటించారు. మంగళవారం మొదటగా రూ.లక్ష చెక్కును సంఘాల ప్రతినిధులకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు ఆమెను ఘనంగా సత్కరించారు.



సభ్యులకు రూ. లక్ష చెక్కును అందజేస్తున్న సౌమిని రెడ్డి